





హామీలే కాదండోయ్.. శిలాఫలకాలు ఇంతేగా..

చెబుతారు.. చేయరంతే!

సీఎంగా హామీలు ఇచ్చినా.. చేసింది సున్నా!

- ఐదేళ్లలో హామీలన్నీ బూటకమే
- కల్లబొల్లి కబుర్లతో జగన్ కాలక్షేపం
- ఉమ్మడి జిల్లా పర్యటనకు వచ్చిన ప్రతిసారీ మోసం
- అదిగో నిధులంటూ ఆశచూపి మరచిన వైనం
- ఉమ్మడి జిల్లా పర్యటనలో ప్రశ్నిస్తున్న జనం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి) మాట తప్పం.. మడమ తిప్పం.. ఇదీ ముఖ్యమంత్రి జగన్ తరచూ వల్లె వేసే సూక్తులు. కానీ ఆచరణలో అడుగడుగునా మాట తప్పడం.. మడమ తిప్పడం పరిపాటిగా మారింది. సీఎం హోదాలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పర్యటనలకు ఈ ఐదేళ్లలో అనేకసార్లు వచ్చి వెళ్లారు. వచ్చిన ప్రతిసారీ నియోజకవర్గాల్లో సమస్యలపై ఎక్కడికక్కడ అలవికాని హామీలు వదిలారు. నేను ఉన్నాను.. నేను విన్నాను అని గత ఎన్నికలప్పుడు డబ్బా కొట్టి గద్దెనెక్కిన ఆయన నేను చెప్పాను.. కానీ ఏదీ చేయను అన్న తరహాలో మారిపోయారు. జిల్లాకు వచ్చినప్పుడు ప్రజలకు కల్లబొల్లి కబుర్లు ఎన్నో చెప్పారు. వందలకోట్ల హామీల వరద పారించి నిధులు కూడా అక్కడికక్కడే విడుదల చేస్తున్నట్టు గొప్పలు చెప్పారు. తీరా ఐదేళ్లు గడిచినా అవేవీ ఆచరణకు నోచుకోలేదు. ఆ చివర రాజోలు నుంచి ఈ చివర రాజమహేంద్రవరం, కాకినాడ వరకు అనేక సభల్లో నోటికొచ్చిన హామీలు జారవిడిచారు. చేతిలో ప్రభుత్వం ఉన్నా అవేవీ ఆచరణలోకి తేలేదు. దీంతో సీఎం జగన్ ఇచ్చిన ప్రతి హామీ కల్లబొల్లి కబుర్లుగానే మారాయి. గోదావరికి వరదలు వచ్చినప్పుడు ఏటిగట్లు ఆధునికీకరిస్తామని చెప్పిన జగన్ తన పాలనలో దాని జోలికెవెళ్లలేదు. గోదావరి కాలువల్లో కాలుష్య నివారణకు మిషన్ క్లీన్ గోదావరి పేరిట హడావుడి చేసి దాన్ని గాలికి వదిలేశారు. పోలవరం పూర్తి చేసి కాలువలకు నీళ్లు విడుదల చేస్తామన్నారు. కానీ ఇప్పటికీ కాలువల పనే పూర్తికాలేదు. 2022 జూలైలో పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలులో కాపునేస్తం సభకు వచ్చిన సీఎం గొల్లప్రోలు, పిఠాపురం పట్టణాల అభివృద్ధికి రూ.40 కోట్లు ఇస్తున్నట్లు గొప్పగా ప్రకటించారు. కానీ ఒక్క రూపాయి విడుదలైతే ఒట్టు. ఏలేరు మొదటి విడత పనుల పూర్తికి రూ.142 కోట్లు, ఏలేరు, సుద్దగెడ్డ ఆధునీకీకరణకు రూ.150 కోట్లు విడుదల చేసేసినట్టు చెప్పారు. గతేడాది పర్యటనలో కాండ్రకోట-తూర్పుపాలికల హైలెవెల్ బ్రిడ్జికి రూ.4కోట్లు ఇచ్చేసినట్లు కలరింగ్ ఇచ్చారు. కాండ్రకోట పరిధిలో ఏలేరు కాలువపై డ్రాప్ కం బెడ్ రెగ్యులేటర్ పునర్నిర్మాణానికి రూ.6 కోట్లు ప్రకటించారు.అయితే ప్రకటనలే.. కాగితాలపై పనులు మూలుగుతున్నాయి. సామర్లకోట జూనియర్ కాలేజీని డిగ్రీ కాలేజీగా మార్చడానికి రూ.18 కోట్లు ఇచ్చేస్తున్నట్టు సీఎం చప్పట్లు కొట్టించుకుని ప్రకటించారు. కానీ ఫైలే సిద్ధం కాలేదు. కాకినాడలో మంచినీటి సమస్య పరిష్కారానికి రూ.47కోట్లు ఇచ్చేసినట్లు చెప్పారు. కానీ నిధులకు అతీగతీ లేదు. ఇలా ఒకటేంటి నోటికి వచ్చిన హామీని సీఎం హోదాలో అలవోకగా వదిలేశారు. ఐదేళ్లయినా అవి కదలక హామీలకు చెదలు పట్టాయి.



ముమ్మిడివరం మండలంలో గ్రోయిన్లు లేక కోతకు గురవుతున్న గోదావరి గట్టు

గోదారిలో... వరద హామీలు..

ముమ్మిడివరం/ఐ.పోలవరం, ఏప్రిల్ 18: జగన్ సీఎం అయ్యాక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గంలో సుమారు రూ.380.26 కోట్లతో చేసిన పలు శంకుస్థాపనలు, హామీలు నేటికీ కార్యరూపం దాల్చలేదు. మత్స్యకార దినోత్సవం సందర్భంగా 2022 మే 13న ఐ.పోలవరం మండలం మురమళ్ల బహిరంగ సభలో సీఎం జగన్ కాట్రేనికోన మండలం పల్లంకుర్రు-ఐ.పోలవరం మండలం జి.మూలపొలం మధ్య వృద్ధ గౌతమి నదీపాయపై రూ.76.90 కోట్లతో వారధి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఐ.పోలవరం మండలం గుత్తెనదీవి-భైరవలంక (గోగుల్లంక) గ్రామాల మధ్య వృద్ధ గౌతమి నదీపాయపై వారధి నిర్మాణానికి రూ.44.50 కోట్లతో శంకుస్థాపన చేశారు. ఐ.పోలవరం మండలం రామాలయం పేట వద్ద నదీకోత నివారణకు 1.200 కిలోమీటర్ల మేర రివిట్‌మెంట్, గ్రోయిన్ల నిర్మాణానికి రూ.79.76 కోట్లతో శంకుస్థాపన చేశారు. ఆ పనులను ఇటీవలే ప్రారంభించినా నత్తనడకన సాగుతున్నాయి. గతేడాది జూలై నెలలో వరదలు సంభవించగా ఆగస్టు 8న జగన్ ముమ్మిడివరం, అయినవిల్లి మండలాల్లోని లంక గ్రామాల్లో బాధితులను పరామర్శించారు. నదీకోత నివారణకు గురజాపులంక, లంకాఫ్ ఠాణేలంక, కూనాలంక, పళ్లవారిపాలెం వివేకానంద వారధి వద్ద, అయినవిల్లి మండలం కొండుకుదురులంక, పొట్టిలంకల్లో 3,700 మీటర్ల మేర రివిట్‌మెంట్, గ్రోయిన్ల నిర్మాణానికి రూ.150 కోట్లు నుంచి రూ.200 కోట్లు విడుదల చేస్తున్నట్టు ప్రకటించినా అవి ఇంతవరకూ విడుదల కాలేదు.




నాడు.. నేడు.. ఇంతేగా!

పి.గన్నవరం/మామిడికుదురు, ఏప్రిల్ 18: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం హైస్కూల్‌లో 2021 ఆగస్టు 16న జరిగిన నాడు-నేడు మొదటి దశ పనుల ప్రారంభోత్సవ బహిరంగ సభలో ఎమ్మెల్యే చిట్టిబాబు అభ్యర్థన మేరకు సీఎం జగన్ పలు హామీలు గుప్పించారు. అప్పనపల్లి ఎత్తిపోతల పథకం, అయినవిల్లి మండలంలో ఎదురుబిడిం కాజ్‌వే నిర్మాణం, మొండెపులంక ఈస్ట్ చానల్ ఆధునికీకరణ పనులకు హామీ ఇచ్చారు.అప్పనపల్లి ఎత్తిపోతల పథకానికి సుమారు రూ.40కోట్ల నుంచి రూ.45 కోట్లు వ్యయం అవుతుందని సంబంధిత అధికారులు అంచనాలు రూపొందించారు. ఐదు లంక గ్రామాల్లో 15 కిలోమీటర్ల మేర పంటకాల్వ ఏర్పాటు చేసి 4,035 ఎకరాల విస్తీర్ణంలోని కొబ్బరి తోటలకు ప్రయోజనం చేకూరేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కానీ అవి కాగితాలకే పరిమితమయ్యాయి. 2022 వరదల తర్వాత లంక గ్రామాల ప్రజలకు గంటి పెదపూడిలో వంతెన నిర్మిస్తామని, బూరుగులంక రక్షణకు గ్రోయిన్ల నిర్మాణం చేపడతామన్నారు. నేటికీ అయినవిల్లి మండలం అయినవిల్లిలంకలో తొగరపాయ ఎదురుబిడిం కాజ్‌వే ఆధునికీకరణ పనుల ఊసేలేదు. ఆర్‌అండ్‌బీ అధికారులు రూ.13 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా ఇప్పటి వరకు పరిపాలనాపరమైన ఆమోదం రాలేదు.2022లో వరదల అనంతరం బూరుగులంక వచ్చిన సీఎంకు మహిళలు తమ ప్రాంతం నదీకోతకు గురవుతోందని, గ్రోయిన్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. సంబంధిత అధికారులతో ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. మరుసటి రోజే హెడ్‌వర్క్స్ అధికారులు నదీకోతకు గురవుతున్న ప్రాంతాలను గుర్తించి సుమారు 450 మీటర్ల మేర గ్రోయిన్ల నిర్మాణానికి రూ.28 కోట్లు నిధులు అవసరమవుతాయని ప్రభుత్వానికి నివేదిక పంపించారు. కానీ నేటి వరకు వాటి ఊసేలేదు.



వరద వస్తే పడవ ప్రయాణమే దిక్కు.. ఎదురుబిడిం బ్రిడ్జి నిర్మాణమేది మరి..



పోలవరం ఎడమ కాలువ

పోలవరం..పరిహారమేదీ

గోకవరం, ఏప్రిల్ 18: జగన్ హామీ ఇస్తారు.. ఆనక మర్చి పోతారనుకుంటా.. ఆయనకు దేవుడిచ్చిన గొప్పవరం అది.. సీఎం జగన్ హామీ ఇచ్చారంటే.. అమలు చేయరంతే అన్నట్టుగా ఉంది పరిస్థితి. వైఎస్ఆర్ హయాంలో మంజూరుకా బడిన పోలవరం ఎడమ కాలువ తవ్వకానికి భూములు త్యాగం చేసిన సుమారు 70 నుంచి 80 మంది రైతులకు అప్పట్లో పూర్తి న్యాయం జరగలేదు. పోలవరం కాలువ తవ్వి సుమారు 20 సంవత్సరాలు కావొస్తుంది. 2005 భూసేకరణ చట్టం ప్రకారం బాధితులకు అన్యాయం జరిగింది. మీకు అప్పట్లో జరిగిన అన్యాయాన్ని నేను పూడుస్తాను. 2013 పార్లమెంట్‌లో భూసేకరణ చట్టంలో చేసిన మార్పులు చేర్పులు ప్రకారం మీ అందరికీ న్యాయం చేస్తాను. అప్పట్లో అందుకున్న నష్టపరిహారానికి చేర్చి ఎకరాకి మొత్తం రూ.5 లక్షలు గిట్టుబాటు అయ్యేలా నష్టపరిహారం చెల్లిస్తానంటూ సుమారు మూడేళ్ళ కిందట ఏజెన్సీ ప్రాంతమైన దేవీపట్నం మండలం ఇందుకూరు విచ్చేసిన సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చినహామీ నేటికీ నెరవేరలేదు. ఆ హామీ ఎప్పటికి అమలవుతుందంటూ రైతులు వెయ్యి కళ్ళతో ఆశగా ఎదురుచూస్తున్నారు.



పిఠాపురం పట్టణ వ్యూ

పట్టణాభివృద్ధి నిధులేవి సారూ!

పిఠాపురం/గొల్లప్రోలు,ఏప్రిల్ 18: మాట తప్పను... మడమ తిప్పను.. ఇది సీఎం జగన్ ప్రతిచోటా చెప్పే మాట. ఆచరణలో మాత్రం మాట చెబితే మడం తిప్పుడే. పట్టణాల అభివృద్ధికి ప్రత్యేక గ్రాంట్లు ఇస్తామన్న మాటలు ఫైళ్ల దాటలేదు. 21 నెలలు గడిచినా ఒక్క రూపాయి విడుదల కాలేదు. పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు పట్టణం లో జరిగిన కాపు నేస్తం సభలో పాల్గొనేందుకు సీఎం జగన్ 2022 జూలై 28న వచ్చారు.ఆ సభలో గొల్లప్రోలు పట్టణాభివృద్ధికి రూ.20 కోట్లు, పిఠాపురం పట్టణాభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. ఏయే పనులు చేపట్టాలో నిర్ణయించుకుని అంచనాలు తీసుకొస్తే తక్షణం నిధులు విడుదల చేస్తామన్నారు. ఇంజనీరింగ్ అధికారులు అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపి 20 నెలలు గడిచినా నేటికీ ఒక్క రూపాయి విడుదల కాలేదు.

జగనన్న ఇళ్లు.. పేదలకు కన్నీళ్లు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)/సామర్లకోట, ఏప్రిల్ 18: వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఇళ్ల పథకం జగన్‌పై నమ్మకాన్ని వమ్ము చేసింది. కాకినాడ సిటీలోని 13,500 మందికి జగన్ ప్రభుత్వం స్థలాల కొరత సాకుతో యు.కొత్తపల్లి మండలం కొమరగిరిలో పట్టాలిచ్చింది. 2020 డిసెంబర్ 25న సీఎం జగన్ కొమరగిరి లేఅవుట్ ప్రారంభించారు. తాజాగా సముద్రం పోటుకు నీళ్ల ఏకంగా ఈలేఅవుట్ స్థలాలు, ఇళ్లకు సమీపంగా రావడంతో బెంబేలెత్తిపోతున్నారు .ఇక్కడ 365 ఎకరాలు ప్రైవేటు భూములను ఎకరం రూ.25 లక్షల చొప్పున సదరు కీలక నేత బినామీలతో భూములు కొనిపించారు. ఆ తర్వాత ప్రభుత్వానికి ఎకరాకు రూ.41 లక్షల చొప్పున అంట గట్టారు.రూ.145 కోట్లకుపైగా కొట్టేశారు. 13,500 మందికిపైగా కాకినాడ సిటీ నియోజకవర్గ లబ్ధిదారులకు పట్టాలు పంచి నాలుగేళ్లవుతున్నా ఇక్కడ పూర్తయిన ఇళ్లు కేవలం 180 మాత్రమే. 10 వేలకు పైగా వివిధ దశల్లో ఆగిపోయాయి. సామర్లకోట మండలంలో 7,537 గృహాలు మంజూరు కాగా వాటిలో 1,174 గృహాలు మాత్రమే పూర్తి చేశారు. గతేడాది జగన్ ఇక్కడకు వచ్చి సామూహిక గృహప్రవేశాలు చేపట్టినా అంతా పైపై బడాయే. రాష్ట్రస్థాయి గృహ నిర్మాణ సంస్థ చైర్మన్‌గా పదవి అధిరోహించిన దవులూరి దొరబాబు స్థానికుడైనా ఇక్కడే ఈ పథకం బోర్లాపడింది.



ఆర్వోకు నామినేషన్ పత్రం అందజేస్తున్న రాజమహేంద్రవరం కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్



ఆర్వోకు నామినేషన్ పత్రం అందజేస్తున్న గోపాలపురం కూటమి అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజు

తొలిరోజే నామినేషన్లకు క్యూ

- తూర్పుగోదావరి జిల్లాలో 6
- అంబేడ్కర్ కోనసీమలో 7
- కాకినాడలో 5 నామినేషన్లు దాఖలు

రాజమహేంద్రవరం/గోపాలపురం/అమలాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి)/కలెక్టరేట్(కాకినాడ) : ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ గురువారం విడుదలైంది. గురువారం దశమి కావడంతో పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలయ్యాయి.తూర్పుగోదావరి జిల్లాలో తొలిరోజు ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. లోక్‌సభకు ఎవరూ వేయలేదు.రాజమహేంద్రవరం సిటీ నుంచి టీడీపీ అభ్యర్థిగా ఆదిరెడ్డి ఒక సెట్ నామినేషన్లు దాఖలు చేయగా ఆయన సతీమణి, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ స్వతంత్ర అభ్యర్థిగా మరో నామినేషన్ దాఖలు చేశారు. గోపాల పురం టీడీపీ అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు రెండుసెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. కొవ్వూరు నుంచి వైసీపీ అభ్యర్థిగా తలారి వెంకట్రావు ఒక సెట్, తలారి పరంజ్యోతి మరో సెట్ దాఖలు చేశారు. నిడదవోలునుంచి వైసీపీ అభ్యర్థిగా గెడ్డం శ్రీనివాసనాయుడు ఒక సెట్ నామినేషన్లు దాఖలు చేశారు.ఇక జిల్లాలోని అనపర్తి, రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్ నుంచి బోణీ కాలేదు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. అమలాపురం ఎస్సీ పార్లమెంటు నియోజకవర్గ స్థానానికి ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. మిగిలిన ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఏడుగురు అభ్యర్థులు పది సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలో తొలిరోజే ఐదు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. గుత్తుల జైశ్రీసూరేంద్రనాథ్‌బాబూజీ స్వతంత్ర అభ్యర్థిగా రెండు సెట్లు, పిల్లి సూర్యప్రకాష్ వైసీపీ తరుపున రెండు, పిల్లి సుభాష్‌చంద్రబోస్ వైసీపీ తరుపున ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. అమలాపురం అసెంబ్లీ స్థానానికి చీకురుమెల్లి కిరణ్‌కుమార్ జనసేన పేరు రాసి ఒక సెట్, స్వతంత్ర్య అభ్యర్థిగా మరో సెట్ నామినేషన్లు దాఖలు చేశారు. మండపేట నియోజకవర్గం నుంచి కోన సూర్యప్రకాశరావు, మార్ని సత్యనారాయణ స్వతంత్ర అభ్యర్థులుగా రెండు సెట్లు, నందికోళ్ల రాజు నవతరం పార్టీ తరుపున ఒక సెట్ నామినేషన్లు దాఖలు చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ముమ్మిడివరం, రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గాలనుంచి ఇంకా అభ్యర్థులెవరూ నామినేషన్లు వేయలేదు.కాకినాడలో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జె.నివాస్ ఎన్నికల నోటిఫికేషన్‌ను గురువారం విడుదల చేశారు.కాకినాడ లోక్‌సభకు సంబంధించి జిల్లా కలెక్టర్ నివాస్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఆర్వో కార్యాలయంలో నామినేషన్ స్వీకరించారు. తొలిరోజు కాకినాడ లోక్‌సభకు ఒక్క నామినేషన్ దాఖలైంది. ఇండిపెండెంట్ అభ్యర్థిగా మెర్ల భవాని శంకర్ ప్రసాద్ రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాలు ఏడు ఉండగా రెండు నియోజకవర్గాల్లో నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి.దీనిలో కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఇండిపెండెంట్లుగా టేకుమూడి శ్రీనివాసరావు, వినుకొండ వెంకటేశ్వరరావు, మట్టా వెంకటేశ్వరరావు నామినేషన్లు వేశారు. ఒక్కొక్క సెట్ చొప్పున ఆర్వోకు నామినేషన్ అందజేశారు.కాకినాడ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గంనుంచి డాక్టర్ పితాని అన్నవరం ఇండిపెండెంట్‌గా ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. మిగిలిన ఐదు నియోజకవర్గాల్లో నామినేషన్ నిల్‌గా దర్శనమిచ్చింది.

ఓ విద్యార్థి ప్రాణం కాపాడిన రైల్వే ఉద్యోగి అప్రమత్తత

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పరీక్షల్లో ఫెయిలవడంతో ఆత్మహత్య చేసుకుంటానంటూ ఇంటి నుంచి బయటకు వచ్చిన ఓ విద్యార్థిని రైల్వే ఉద్యోగి అప్రమత్తత కాపాడింది.కాకినాడకు చెందిన ఉస్మాన్ కుమారుడు(17) ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత సాధించకపోవడంతో ప్రాణాలు తీసుకుంటానని చెప్పి 17న ఇంటి నుంచి బయటకు వచ్చేశాడు. ఇంట్లో వాళ్లు కాకినాడ రైల్వేస్టేషన్‌లో ఫొటో చూపించి వాకబు చేస్తున్న క్రమంలో కాకినాడ నుంచి బెంగళూరు వెళ్లే రైలెక్కడం చూశామని స్టేషన్‌లోని కూలీలు చెప్పారు. వెంటనే రాజమండ్రిలో ఉన్న తన అన్నయ్యకు ఉస్మాన్ ఫోన్ చేసి చెప్పారు. వాళ్ల రాజమండ్రి రైల్వే స్టేషనుకు వెళ్లి చీఫ్ టికెటింగ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళికి విషయం చెప్పడంతో అప్రమత్తమయ్యారు. టీసీలు వై.నరేశ్, పి.ప్రశాంత్, జీవీఎన్ భవానీతో విషయం చెప్పి రైలులో వెతకడం ప్రారంభించారు. ఎస్-11 బోగీ బాత్రూం వద్ద కూర్చుని ఉన్న ఆ బాలుడిని చంద్రమౌళి గుర్తించారు. జీఆర్పీ పోలీసుల సహాయంతో కిందికి దింపి కౌన్సెలింగ్ చేశారు. బాలుడి తండ్రి సూచనలతో రాజమండ్రిలోని వారి బంధువులకు అప్పగించారు. ఈ మేరకు సీటీఐ చంద్రమౌళి, టీసీలను డీఆర్ఎం నరేంద్ర ఏ.పాటిల్,కమర్షియల్ మేనేజర్ రాంబాబు ప్రశంసించారు.

సీఎం జగన్ మౌనయాత్ర!

- బస్ దిగలేదు.. ఓటు అడగలేదు
- బస్ లోపల నుంచే అభివాదం
- అక్కడక్కడా మాత్రమే బయటకు
- రెండు జిల్లాల పర్యటనలోనూ ఇంతే
- జగన్ రోడ్ షో.. వైసీపీ నేతల నిరాశ
- ఎస్టీ రాజాపురంలో రాత్రి బస
- ఉదయం నుంచి హైవేపై ట్రాఫిక్ ఇక్కట్లు



సీఎం కాన్వాయ్ వస్తున్న వేళ ఖాళీగా జొన్నాడ సెంటర్



ఇలాగే రోడ్ షో : బస్ లోపల నుంచే అభివాదం

రావులపాలెం/ఆలమూరు/రాజమహేంద్రవరం/సిటీ/రూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ యాత్రకు స్పందన అంతంతమాత్రంగానే ఉంది. వైసీపీ నాయకులు నానాతంటాలూ పడి ఆటోల్లో తరలించిన జనాలకు ఆపద్ధర్మ ముఖ్యమంత్రి జగన్ అభివాదంతో సరిపెట్టారు. జిల్లాలోని బస్సు యాత్రలో ఎక్కడా కూడా బస్సు నుంచి జగన్ కిందికి దిగి మాట్లాడలేదు. అక్కడక్కడా అభివాదం చేసుకుంటూ ముందుకు వెళ్లిపోయారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో గురువారం పర్యటన ముగించుకుని బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, తూర్పుగోదావరి జిల్లాలో జాతీయ రహదారి మీదుగా రోడ్ షో నిర్వహించారు. సీఎం జగన్ బస్సు యాత్ర రావులపాలెం, ఆలమూరు మీదుగా మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో కడియం మండలం పొట్టిలంక చేరుకున్నారు. అక్కడ బస్సు లోపల నుంచే అభివాదం చేసుకుంటూ కడియపులంకలో ఏర్పాటు చేసిన బసకు చేరుకున్నారు. 4 గంటల సమయలో కడియపులంక పూలమార్కెట్ సెంటర్‌లో అభివాదం చేస్తూ బుర్రిలంక, వెంకయ్యపేట గ్రామాల మీదుగా వేమగిరి చేరుకున్నారు.బొమ్మూరు, హుకుంపేట మీదుగా సాయంత్రం 5:30 గంటలకు రాజమహేంద్రవరం మోరంపూడి సెంటర్‌కు చేరుకున్నారు. మోరంపూడి వద్ద సెంటర్‌లో బస్‌పైకి ఎక్కి ప్రజలకు అభివాదం చేశారు. లారీ స్టాండ్ సెంటర్, వీఎల్ పురం, పాతసోమాలమ్మ ఆలయం సెంటర్, ఆర్‌టీసీ కాంప్లెక్స్, తాడితోట, బైపాస్ రోడ్డు మీదుగా స్వామి థియేటర్ సెంటర్, అజాద్ చౌక్, అల్లూరి సెంటర్, దేవీచౌక్, గోకవరం బస్టాండ్ సెంటర్ మీదుగా అంబేడ్కర్ సెంటర్ నుంచి ఆర్యాపురం మీదుగా మూలగొయ్యి, సీతంపేట మీదుగా పేపరుమిల్లు సెంటర్‌కు చేరుకున్నారు. ప్రజలు ఎక్కువ ఉన్నచోట బస్సుపైకి ఎక్కి అభివాదం మాత్రమే చేశారు. అటుపై మల్లయ్యపేట, కాతేరు మీదుగా గామన్ రోడ్డు దివాన్‌చెరువు వైపు వెళ్లారు. పర్యటన ముగించుకుని గురువారం రాత్రి రంగంపేట మండలం ఎస్టీ రాజాపురంలో ఏడీబీ రోడ్డు ప్రక్కన గల ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన బసకు చేరుకున్నారు. కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల నడుమ జగన్ పర్యటన సాగింది. ఆలమూరు మండలం మడికిలో పల్లవి, ప్రత్యూష అనే బాలికలు అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన బస్సు దిగి వారితో మాట్లాడి న్యాయం చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ జగదీశ్ కాన్వాయ్ వెంటే ఉన్నారు. జగన్ కూడళ్లలో ఆగినప్పుడు మొబైల్ కమాండ్ కంట్రోల్ వాహనానికి అనుసంధానమై ఉండే డ్రోన్‌ను ఎగురవేసి పరిస్థితులను సీఎం భద్రతా సిబ్బంది గమనించారు. బస్సుపై ముగ్గురు భద్రతా సిబ్బంది బైనాక్యులర్స్‌తో నిరంతరాయంగా పరిశీలించారు. జగన్ వద్ద ఒకరిద్దరు మినహా ఎక్కువ సంఖ్యలో వైసీపీ నాయకులు లేకుండా జాగ్రత్త తీసుకున్నారు. జగన్ బస్సు యాత్రలో ఎక్కడా పూలదండలు కనిపించకపోవడం గమనార్హం.



కట్టుదిట్టమైన భద్రత మధ్య అక్కడక్కడా పైకి వచ్చి ఇలా..

పేపరు మిల్లు కార్మికులకు హామీ ఏదీ..

గత 16 రోజులుగా సమ్మెలో ఉన్న ఆంధ్రప్రదేశ్ పేపరు మిల్లు కార్మికులు జగన్‌కు వినతిపత్రం ఇచ్చి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. జగన్ బస్సుయాత్ర పేపర్ మిల్లు వద్దకు చేరుకోగానే ఉయ్ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలు చేశారు. దీంతో అక్కడ గందరగోళ పరిస్థితి నెలకొంది. జగన్ తన బస్సులోకి ముగ్గురు కార్మిక నాయకులను పిలిచి వారి వద్ద నుంచి వినతిపత్రం స్వీకరించారు. అయితే కార్మికులకు స్పష్టమైన హామీ ఇవ్వకుండానే అక్కడ బస్సు పైకి ఎక్కి అభివాదం చేసి ముందుకు సాగారు.దీనిపై పేపరు మిల్లు కార్మికులు అసహనం వ్యక్తం చేశారు.

అయ్యో రామ.. పూజ ఆపేశారా?

సీతంపేటలో శతాబ్దం పైబడి చరిత్ర కలిగిన రామాల యం ఉంది. ఇక్కడ 17న శ్రీరామనవమి ఉత్సవాలు చేశారు. రోడ్డుకు ఓ వైపు ట్రాఫిక్‌కి ఇబ్బంది లేకుండా టెంటు వేసి కల్యాణం చేస్తారు. నాలుగు రోజుల పాటు టెంటును అలాగే ఉంచుతారు. అయితే జగన్ రాక సందర్భంగా ఆ టెంటును తీసివేయించడంతో పాటు గురువారం సాయంత్రం జరగాల్సిన పూజలు జగన్ వెళ్లే వరకూ నిలిపివేయించారు.

అంబేడ్కర్‌ను మరిచారా జగన్

రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఏ రాజకీయ వచ్చినా ఖశ్చితంగా దిగి విగ్రహానికి నివాళులర్పించి వెళతారు. ఇది ఎప్పటి నుంచో వస్తున్న సంప్రదాయం. జగన్ పర్యటనలో ఆ సెంటర్ నుంచి వెళ్లారు కానీ అక్కడ ఆగి నివాళులర్పించలేదు. దీనిపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బైక్‌కు పెట్రోల్..మహిళలకు రూ.300?

జగన్ పర్యటన సందర్భంగా జాతీయ రహదారిపై ఆంక్షలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సు యాత్ర డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం గోపాలపురం వద్ద ప్రవేశించాక సర్వీసు రోడ్ల నుంచి ప్రజలెవరూ జాతీయ రహదారిపైకి రాకుండా పోలీసులు ఆంక్షలు విధించడంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. ఆర్టీసీ బస్సులు పూర్తిస్థాయిలో రాక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈతకోటలోని ఓ ఫార్మసీ కళాశాల యజమాన్యం జగన్ కోసం విద్యార్థులను మండుటెండలో నుంచో పెట్టారు.బస్సు యాత్ర రావులపాలెం రాక ముందే పలువురు మహిళలు వెనుదిరిగి వెళ్లిపో వడం కనిపించింది. జొన్నాడ నుంచి మడికి వరకు సాగిన యాత్రలో జనం లేకపోవడంతో ఆయన బస్సు లోపలే ఉండిపోయారు. ఇక జగన్ పర్యటన అంతటా పెద్దగా జనస్పందనలేదు. బైక్‌లకు ఉచిత పెట్రోల్,మందు, మహిళలకు రూ.300 ఇవ్వడంతో పాటు భోజనాలు ఏర్పాటు చేసినట్టు సమాచారం.



రావులపాలెంలో జగన్ పర్యటనకు ఎండలో విద్యార్థులు

వ్యవసాయం, వాణిజ్యం, పారిశ్రామికం, పరిశోధన..ఇవన్నింటికీ పెద్దాపురం నియోజకవర్గం కేంద్రం..అలాగే ఒక నియోజకవర్గంలో రెండు మున్సిపల్ పట్టణాలు ఉండడం ఈ నియోజకవర్గానికి ఉన్న మరో ప్రత్యేకత. సామర్లకోట,పెద్దాపురం పట్టణాలు, మండలాలతో కలిపి పెద్దాపురం అసెంబ్లీ నియోజకవర్గం ఉంది. పంచారామాలలో ఒకటిగా పేరొందిన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయం ఇక్కడ ఉంది. సామర్లకోట రైల్వే జంక్షన్ ప్రముఖమైనది. రాజానగరం-అచ్చంపేట(కాకినాడ) మధ్య ఏడీబీ రోడ్డులతో రవాణా సదుపాయాలు పుష్కలంగా ఉండడంతో పారిశ్రామికంగా ఎంతగానో అభివృద్ధి చెందిన నియోజకవర్గంగా పెద్దాపురానికి పేరుంది. పరిశ్రమల్లో బియ్యం, తవుడు నూనె, అంతర్జాతీయ స్థాయిలో సిరామిక్ టైల్స్ ఉత్పత్తి, పౌల్ట్రీ రంగంతో పాటు రెండు తెలుగు రాష్ట్రాలలో మరెక్కడా లేని రీతిలో సగ్గుబియ్యం పరిశ్రమలు, పలు వ్యవసాయాధారిత పరిశ్రమలతో మనుగడ సాగుతున్నాయి.


ఆనాటి.. చరిత్ర



● సామర్లకోట

వ్యవసాయానికి | వాణిజ్యానికి | పరిశ్రమలకు | పరిశోధనలకు

పెద్దాపురం



నేడే పోలింగ్

యానాంలో సర్వం సిద్ధం

పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి నేడు ఎన్నిక

కేంద్ర పాలిత ప్రాంతం యానాంలో పోలింగ్ ఏర్పాట్లు పూర్తి

ఓటు హక్కు వినియోగించుకోనున్న 39,408 మంది

పోలింగ్ స్టేషన్లకు చేరిన ఈవీఎంలు, ఇతర సామగ్రి

యానాం, ఏప్రిల్ 18: కేంద్ర పాలిత ప్రాంతమైనా పుదుచ్చేరి రాష్ట్రానికి ఒక లోక్‌సభ స్థానం మాత్రమే ఉంది. ఈ లోక్‌సభ స్థానానికి 19వ తేదీ శుక్రవారం పోలింగ్ జరగనుంది. దేశ వ్యాప్తంగా మొదటి విడత పోలింగ్ జరిగే లోక్‌సభ స్థానాల్లో పుదుచ్చేరి కూడా ఉండడంతో పోలింగ్‌కు సర్వం సిద్ధం చేశారు. పుదుచ్చేరి లోక్‌సభ స్థానంలో మొత్తం 30 నియోజకర్గాలు ఉన్నాయి. వాటిలో ఒకటి భౌగోళికంగా కాకినాడ జిల్లాలో అంతర్భాగంగా ఉన్న యానాం నియోజకవర్గం. యానాం నియోజకవర్గంలో సుమారు 40 వేల మంది ఓటర్లు ఉన్నారు. పుదుచ్చేరి లోక్‌సభ స్థానంలో మొత్తం 10,23,699 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 4,80,569 మంది ఉండగా, మహిళలు 5,42,979 మంది, థర్డ్ జెండర్ 148 మంది ఓటర్లు ఉన్నారు. యానాంలో మొత్తం 39,408 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 19,037 మంది, మహిళలు 20,371 మంది ఉన్నారు. యానాం నియోజకవర్గ పరిధిలో మొత్తం 10 వార్డులకు గాను మొత్తం 33 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే పుదుచ్చేరి నుంచి పోలింగ్ సామగ్రి వచ్చింది. పోలింగ్‌కు సంబంధించి ఎన్నికల విభాగం పూర్తి చేసింది. అధికారులకు, సిబ్బందికి ఇప్పటికే నిర్వహణపై శిక్షణ కార్యక్రమం పూర్తి చేశారు. ఇప్పటికే పోస్టల్ బ్యాలెట్ ముగిసిన విషయం తెలిసిందే.

ఈవీఎంల తరలింపు

యానాంలోని నిర్వహించే ఎన్నికలకు సంబంధించి డాక్టర్ ఎస్ఆర్‌కె ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో భద్రపరిచిన ఈవీఎంలను భారీ భద్రత నడుమ పోలింగ్ కేంద్రాలకు చేరాయి. యానాం ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మునిస్వామి పర్యవేక్షణలో యానాంలోని 33 పోలింగ్ కేంద్రాలకు 5 సెక్టార్లలో ఈవీఎంలను తరలించారు.




పోలింగ్ స్టేషన్‌కు వెళుతున్న ఎన్నికల సిబ్బంది

ప్రధానంగా ఇద్దరి మధ్యనే

పుదుచ్చేరి లోక్‌సభ స్థానంలో మొత్తం 26 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నప్పటికీ ప్రధాన పోటీ బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్యే ఉన్నట్లు ప్రస్తుతం ఉన్న ఎన్నికల వాతావరణం స్పష్టం చేస్తోంది. ఒకరు కాంగ్రెస్ కూటమి అభ్యర్థి, మాజీ ముఖ్యమంత్రి వి.వైద్యలింగం కాగా మరొకరు ఎన్డీయే అభ్యర్థి, ప్రస్తుత ముఖ్యమంత్రి ఎన్.రంగసామి మేనల్లుడు, పుదుచ్చేరి హోంమంత్రి నమశ్శివాయ ఉన్నారు.



నమశ్శివాయ



వైద్యలింగం



సామర్లకోట నియోజకవర్గం అనే పేరు కేవలం రెండు సార్లు 1955, 1962లలో మాత్రమే మెరిసి తిరిగి మాయం అయ్యింది. అప్పట్లో సామర్లకోట నియోజకవర్గం తరపున అప్పటి పీసీసీ అధ్యక్షుడు, సామర్లకోటకు చెందిన మహ్మద్ ఇస్మాయిల్ కాంగ్రెస్ పార్టీ తరపున పోటీచేసి సీపీఐ అభ్యర్థి ఉండవల్లి నారాయణ మూర్తిపై గెలుపొందారు.

1952లో ఆవిర్భావం

పెద్దాపురం నియోజకవర్గం 1952లో ఏర్పడింది. 1955లో మొట్టమొదటి సారిగా ఎన్నికలు నిర్వహించారు. సామర్లకోట, పెద్దాపురం రెండు మున్సిపల్ పట్టణాలు కలిగి ఉన్న ఏకైక నియోజకవర్గం బహుశా రాష్ట్రంలోనే పెద్దాపురం ఒక్కటే కావడం గమనార్హం. సామర్లకోట మండలంలో 18 గ్రామాలు, పట్టణంలో 31 వార్డులు, పెద్దాపురం మండలంలో 23 గ్రామాలు, పట్టణంలో 29 వార్డులు విస్తరించి ఉన్నాయి. నియోజకవర్గంలో 212 పోలింగ్ కేంద్రాలను కూడా గుర్తించారు. 15 దఫాలుగా జరిగిన పెద్దాపురం నియోజకవర్గ ఎన్నికలలో ఆరు సార్లు టీడీపీ, ఆరుసార్లు కాంగ్రెస్, రెండుసార్లు సీపీఐ, ఒక సారి ప్రజారాజ్యం పార్టీలు గెలుపొందాయి. ఏడు దఫాలు స్థానికేతరులు విజయం సాధించారు. మిగిలిన ఆరు దఫాలు స్థానికులు విజయం సాధించారు. 2014లో విభజన జరగ్గా సంపర నియోజకవర్గ పరిధిలో ఉన్న సామర్లకోట మండలంలోని 8 గ్రామాలు పెద్దాపురం నియోజకవర్గంలో కలిశాయి.

నియోజకవర్గ అభివృద్ధి

పెద్దాపురం నియోజకవర్గంలో ఈ ఐదేళ్లలో జగనన్న ఇళ్లు తప్ప పెద్దగా ఎటువంటి అభివృద్ధి పనులు ముందుకు సాగలేదు. అరకొరగా జగనన్న కాలనీలు పేరిట ప్రభుత్వం ఇళ్లు నిర్మించినట్లు ప్రకటనలు చేసుకుంటున్నప్పటికీ లబ్ధిదారులు తమ సొంత నిధులు అధిక శాతం వెచ్చించి మాత్రమే ఇళ్లు నిర్మించుకోగా వాటిని తామే నిర్మించినట్లు ప్రభుత్వం సామూహిక గృహప్రవేశాలు పేరిట ఆర్భాటాలు చేసింది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సుమారు రూ.1,000 కోట్లతో పలు అభివృద్ధి పనులు పూర్తి చేశారు. మరో 100 కోట్ల మేర అభివృద్ధి పనులు వివిధ దశల్లో ఉండగా వైసీపీ ప్రభుత్వం రావడంతో అవన్నీ ఆగిపోయాయి. వైసీపీ నిధులు కేటాయించకపోవడంతో పనులు ఎక్కడివి అక్కడ ఆగిపోయాయి. పునాదులు, మొండి గోడలు దర్శనమిస్తున్నాయి. వ్యవసాయ పరిశోధనా క్షేత్రంలో రూ.3.50 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టిన ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ నిర్మాణం పూర్తి కాలేకపోయింది.





ఓటర్ల సంఖ్య ఇది..

పెద్దాపురం నియోజకవర్గంలో 2,08,930 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 1,03,001 మంది, స్త్రీలు 1,05,916 మంది ఉన్నారు. ఇతరులు 13 మంది ఉన్నారు. పెద్దాపురం పట్టణ పరిధిలో 40,074 మంది ఓటర్లు ఉన్నారు. పెద్దాపురం మండల పరిధిలో 58,762 మంది ఓటర్లు ఉన్నారు. సామర్లకోట పట్టణ పరిధిలో 42,090 మంది ఓటర్లు ఉండగా సామర్లకోట మండల పరిధిలో 68,004 మంది ఓటర్లు నమోదయ్యి ఉన్నారు. ఈ నెల 15 వరకూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మరో 25 వేల మంది ఓటర్లు తాజాగా నమోదు చేసుకున్నట్లు సమాచారం.

కాలుష్యం.. ప్రధాన సమస్య

సామర్లకోట, పెద్దాపురం పట్టణాలలో ప్రధానంగా కాలుష్య సమస్య వేధిస్తోంది. తాగునీటి సమస్యలు సుదీర్ఘకాలంగా వెంటాడుతూనే ఉన్నాయి. ఆయా పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థ కాలుష్య జలాలు నేరుగా గోదావరి కాలువలోకి విడుదల కావడంతో సామర్లకోట, పెద్దాపురం పట్టణాల ప్రజలే కాకుండా కాకినాడ నగర పాలక సంస్థకు చెందిన ప్రజలు కూడా కలుషిత నీరు తాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక సామర్లకోట జంక్షన్ కావడంతో నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తుంది. గంటల తరబడి వాహనాలకు బ్రేక్ ఏర్పడుతుండడంతో సామర్లకోట దాటాలంటే గండం గట్టెక్కినట్లుగా పలువురు వాహనదారులు భావిస్తున్నారు.

కాంగ్రెస్ 6 సార్లు.. టీడీపీ 6 సార్లు



నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఆరుసార్లు, కాంగ్రెస్ పార్టీ ఆరు సార్లు, సీపీఐ రెండు సార్లు గెలుపొందగా, ప్రజారాజ్యం పార్టీ ఒక సారి గెలుపొందింది. నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలుపొందిన పంతం పద్మనాభం అప్పటి నేదురుమల్లి జనార్ధనరెడ్డి మంత్రివర్గంలో దేవదాయ శాఖ మంత్రిగా పనిచేశారు. తర్వాత 2014లో జరిగిన ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తరపున గెలుపొందిన నిమ్మకాయల చినరాజప్ప చంద్రబాబు మంత్రివర్గంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, హోంమంత్రిగానూ పనిచేయడం విశేషం.

సంవత్సరం	విజేత	ప్రత్యర్థి
1952	తోట రామస్వామి(కాంగ్రెస్)	డీవీ సుబ్బారావు (స్వతంత్ర అభ్యర్థి)
1955	డీవీ. సుబ్బారావు(సీపీఐ)	పి. అప్పారావు(కెఎల్‌పీ)
1962	పంతం పద్మనాభం(కాంగ్రెస్)	డీవీ. సుబ్బారావు(సీపీఐ)
1967	ఉండవల్లి నారాయణమూర్తి(సీపీఐ)	కొండపల్లి కృష్ణమూర్తి(కాంగ్రెస్)
1972	కొండపల్లి కృష్ణమూర్తి(కాంగ్రెస్)	ఉండవల్లి నారాయణమూర్తి(సీపీఐ)
1978	ఉండవల్లి నారాయణమూర్తి(కాంగ్రెస్)	ఏలేటి దనయ్య(జనతా)
1983	బలుసు రామారావు(టీడీపీ)	గోలి రామారావు(కాంగ్రెస్)
1985	బలుసు రామారావు(టీడీపీ)	దుర్వాసుల సత్యనారాయణమూర్తి(కాంగ్రెస్)
1989	పంతం పద్మనాభం(కాంగ్రెస్)	బొడ్డు భాస్కరరామారావు(టీడీపీ)
1994	బొడ్డు భాస్కరరామారావు(టీడీపీ)	పంతం పద్మనాభం(కాంగ్రెస్)
1999	బొడ్డు భాస్కరరామారావు(టీడీపీ)	పంతం గాంధీమోహన్(కాంగ్రెస్)
2004	తోట గోపాలకృష్ణ(కాంగ్రెస్)	బొడ్డు భాస్కరరామారావు(టీడీపీ)
2009	పంతం గాంధీమోహన్(ప్రజారాజ్యం)	బొడ్డు భాస్కరరామారావు(టీడీపీ)
2014	నిమ్మకాయల చినరాజప్ప(టీడీపీ)	తోట సుబ్బారావు నాయుడు(వైసీపీ)
2019	నిమ్మకాయల చినరాజప్ప(టీడీపీ)	తోట వాణీ(వైసీపీ)



తోట రామస్వామి | డీవీ సుబ్బారావు | పంతం పద్మనాభం | నారాయణమూర్తి | గాంధీమోహన్

కృష్ణమూర్తి | రామారావు | భాస్కర రామారావు | గోపాలకృష్ణ | చినరాజప్ప



సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 18:

మాటిచ్చి మోసం

తమ్మవరం రైతుల ఆవేదన

తమ్మవరంలో భూములిచ్చిన రైతులంతా సన్న,చిన్న కారు రైతులే. ఎకరాకు కేవలం రూ. 80 వేలు పరిహారం ప్రకటించడం ఎంత వరకు సమంజసం. పక్కనున్న పంటలు పండేందుకు అనువుగా లేని భూమికి ఎకరాకు సుమారు రూ. 60 లక్షలు దాకా ప్రభుత్వం చెల్లించి సేకరించింది. తమ వద్ద నుంచి ఏపీఐఐసీ సేకరించిన బలవంతపు భూసేకరణ రద్దు చేసి, డీ నోటిఫైడ్ చేసి మా భూములను మాకు తిరిగి అప్పగించాలి. సీఎం హామీ నిలబెట్టుకోవాలి..




జి. సత్యసుభాష్, తమ్మవరం, రైతు



"నేను విన్నాను..నేను ఉన్నాను..వైఎస్ బిడ్డగా చెబుతున్నా..జగనన్నగా చెబుతున్నా...నేను అధికారంలోకి రాగానే మీ భూములను ఏపీఐఐసీ నుంచి డీ నోటిఫైడ్ చేయించి మీ కళ్లలో ఆనందం చూస్తాను'..అని పాదయాత్రలో జగన్ చెప్పారు. కానీ సీఎం అయిన తర్వాత ఆ మాటే మరిచారు. ఏమైంది మీరు మాకిచ్చిన హామీ, ఎందుకు మడమ తిప్పారంటూ తమ్మవరం రైతులు సీఎం జగన్‌ను ఇప్పుడు ప్రశ్నిస్తున్నారు.

కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం తమ్మవరంలో సుమారు 3500 మంది నివసిస్తున్నారు. ఇక్కడ నివసించే వారంతా వ్యవసాయం, అనుబంధ రంగాలు, మామిడి తాండ్ర తయారీపై ఆధారపడి జీవనాధారం పొందుతున్నారు. 1999 సంవత్సరంలో ప్రభుత్వ పారిశ్రామిక అవసరాల కోసం తమ్మవరం రైతులకు చెందిన సర్వే నెంబర్లు 41/11, 42, 43 లలో సుమారు 298 ఎకరాల జిరాయితీ భూమిని చిన్న, సన్న కారు రైతుల నుంచి ప్రభుత్వం బలవంతంగా సేకరించింది. అర ఎకరం, ఎకరం ఉన్న రైతులే ఈ భూములకు యాజమానులుగా ఉన్నారు. మూడు పంటలు పండే భూములను ఏపీఐఐసీకి ఇచ్చేందుకు రైతులు అంగీకరించలేదు. ప్రభుత్వం ఎకరాకు సుమారు 80 నుంచి లక్ష రూపాయల లోపున పరిహారం ఇస్తామని ప్రకటించడం, ఈ రేటుకు తమ భూములను ఎట్టి పరిస్థితుల్లో ఇచ్చేదిలేదని కొంత మంది రైతులు కోర్టుకు వెళ్లారు. సీఎం జగన్ పాదయాత్రగా 2019లో కాకినాడ వచ్చినప్పుడు భూసమస్యను అడిగి తెలుసుకున్నారు. మూడు పంటలు పండే పొలాలు ప్రభుత్వం తీసుకోవడం మంచి పద్ధతి కాదని, తాను అధికారంలోకి వచ్చిన వెంటనే భూములు వెనక్కి వచ్చేలా డీ నోటిఫైడ్ చేస్తానని జగన్ హామీ ఇచ్చారు. ఈ హామీని నమ్మి 2019 అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీకి ఓట్లేసి గెలిపించామని రైతులు చెబుతున్నారు. సీఎంగా జగన్ ప్రమాణ స్వీకారం చేయడం, మంత్రిగా స్థానిక ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అయినా, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏళ్లు గడచి తిరిగి ఎన్నికలు వచ్చినా సీఎం ఇచ్చిన హామీని మాత్రం నిలబెట్టుకోలేకపోయారని రైతులు అన్నారు. గ్రామ పంచాయతీని ఏకగ్రీవం చేస్తే మీ భూములను సీఎంతో మాట్లాడి వెనక్కి ఇప్పించే బాధ్యత తనదని అప్పటి మంత్రి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు తమను మభ్యపెట్టి పంచాయతీని ఏకగ్రీవం చేయించుకున్నారని ఆరోపించారు. భూముల అప్పగింతపై తూతూ మంత్రంగా ఒకట్రెండు సార్లు అధికారులతో మాట్లాడటం తప్పించి, ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఎన్నికల ముందు నాయకులు ఓట్లు వేయించుకునేందుకు తమ భూములను బూచిగా చూపించి లబ్ధి పొందుతున్నారని ఆరోపించారు. తమ సమస్యకు పరిష్కారం చూపించే పార్టీలకే ఓట్లు వేస్తామని స్పష్టం చేశారు.

బాధలోనూ బాధ్యత



కరప, ఏప్రిల్ 18: తండ్రి సంవత్సరీకం రోజున ఇంటికొచ్చిన అతిథులకు ఓటు హక్కు విశిష్టతను తెలియజేసి సమాజం మీద తనకున్న బాధ్యతను తెలియజేశారు కరపకు చెందిన సాంబ శివరావు. కరప గ్రామానికి చెందిన దేవ గుప్తాపు వీరభద్రరావు (కరణం గారు) సంవత్సరీకం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి వచ్చిన బంధువులు, సన్నిహితులను అతని కుమారుడు సాంబశివరావు సాదరంగా ఆహ్వానించి అతిథ్యమిచ్చారు. తిరిగి వెళుతున్నవారి చేతికి తండ్రి పేరు మీద ముద్రించిన కరపత్రాలను అందించారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కు ఓటు అని, స్వేచ్ఛగా ఓటేసి సరైన నాయకుడిని ఎన్నుకోవాలని అందులో రాసి ఉంది. తండ్రి మరణించిన బాధలోను సామాజిక స్పృహతో ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేసే ప్రయత్నం చేసిన సాంబశివరావును ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

అధికారులకు మాత్రం కనిపించదు..



పి.గన్నవరం, ఏప్రిల్ 18: పి.గన్నవరం మండలం కె.ముంజవరం పంచాయతీ కార్యాలయం దగ్గరలో నూతనంగా నిర్మిస్తున్న వెల్‌నెస్ సెంటర్ వద్ద సీఎం జగన్ చిత్రాలతో ఉన్న ఓ బోర్డు దర్శనమిస్తున్నా అధికారులకు కనిపించలేదు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఆ బోర్డును మూసి వేయాలి. లేదా జగన్ చిత్రాలు కనిపించకుండా చేయాలి. కానీ పంచాయతీ కార్యాలయం పక్కనే ఉన్నా అధికారులకు మాత్రం ఆ బోర్డు కనిపించకపోవడం విశేషం.



జన కేతనం
ఆంధ్రజ్యోతి
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా
శుక్రవారం 19 ఏప్రిల్ 2024

18వ సారీ హోరాహోరీ

- రాజమహేంద్రవరం లోక్‌సభకు భలే చరిత్ర
- 1952 నుంచి ఇప్పటివరకూ 17 సార్లు ఎన్నికలు
- కూటమి అభ్యర్థిగా ఎన్టీఆర్ కుమార్తె పురందేశ్వరి
- వైసీపీ అభ్యర్థిగా డాక్టర్ గూడూరి శ్రీనివాసరావు
- కాంగ్రెస్ అభ్యర్థిగా పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు
- జిల్లాలో ఇప్పటి వరకూ మొత్తం ఓటర్ల సంఖ్య 16,16,918 మంది


దగ్గుబాటి పురందేశ్వరి
కూటమి అభ్యర్థి


గూడూరి శ్రీనివాస్
వైసీపీ అభ్యర్థి


గిడుగు రుద్రరాజు
కాంగ్రెస్ అభ్యర్థి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం లోక్‌సభకు మంచి చరిత్రే ఉంది. అనేకమంది ప్రముఖులు, సినీతారలు ఇక్కడి నుంచే విజయం సాధించారు. ఇప్పటి వరకూ 17 సార్లు ఎన్నికలు జరిగాయి. అందులో 9సార్లు కాంగ్రెస్ అభ్యర్థులు గెలవగా, టీడీపీ ఆవిర్భావం తర్వాత ఈ నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు మారాయి. తర్వాత మూడుసార్లు టీడీపీ, రెండుసార్లు బీజేపీ, ఒకసారి వైసీపీ గెలిచారు. 1952లో జరిగిన తొలి ఎన్నికలలో ఇది ద్విసభ్య నియోజకవర్గంగా ఉండడంతో కమ్యూనిస్ట్ పార్టీ నుంచి కానేటి మోహనరావు, సోషలిస్ట్ పార్టీ నుంచి నల్లా రెడ్డినాయుడు గెలిచారు. ఇక్కడి నుంచి ప్రముఖ సినీనటులు జమున, మాగంటి మురళీమోహన్ కూడా విజయం సాధించడం గమనార్హం. ఈసారి రాజమహేంద్రవరం లోక్‌సభ నుంచి టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, నటసార్వభౌమ ఎన్టీఆర్ కూతురు, టీడీపీ అధినేత మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి సోదరి దగ్గుబాటు పురందేశ్వరి ఇక్కడ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా ఈఎన్నికలలో పోటీ చేస్తున్నారు. ఆమె బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు కూడా. కాంగ్రెస్ తరపున పీసీసీ మాజీ అధ్యక్షుడు, సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు పోటీ చేస్తుండగా, వైసీపీ తరపున రాజకీయాలకు కొత్తఅయిన డాక్టర్ గూడూరి శ్రీనివాసరావు పోటీ చేస్తున్నారు. ఈసారి త్రిముఖ పోటీ నెలకొంది.

రాజమహేంద్రవరం బరిలో పురందేశ్వరి

కూటమి అభ్యర్థిగా బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి బరిలో ఉన్నారు. ఎన్టీఆర్ కుటుంబం నుంచి వచ్చిన మహిళా నేతలలో బాగా రాణిస్తున్న నేత ఆమె. మాజీ కేంద్రమంత్రిగా కూడా పనిచేసిన అనుభవం ఆమెకు ఉంది. బీజేపీకి రాష్ట్రంలో తొలి మహిళా అధ్యక్షురాలిగా కూడా ఆమె ఎనలేని పోరాటం చేస్తున్న సంగతి తెలిసిందే. ఆమె అధ్యక్ష పదవి చేపట్టిన తర్వాత బీజేపీలో కూడా జోష్ పెరిగింది. క్యాడర్‌లో కదలిక వచ్చింది. అంతకు ముందు నేతలు క్యాడర్ పట్టించుకోలేదని, కనీసం సొంత అనుచరులను కూడా గాలికి వదిలేశారనే ఆవేదన ఉంది. పురందేశ్వరి పార్టీలోని పాత, కొత్తనేతలందరినీ కలుపుకుంటూ, పలుకుబడిని పెంచారు. దానికితోడు జనసే న అధినేత పవన్ కల్యాణ్ కృషితో టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తు కూడా కుదిరింది. దీంతో ఆమెను చారిత్రక రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం నుంచి కూటమి అభ్యర్థిగా బరిలోకి దించారు. రాజమహేంద్రవరం నుంచి గతంలో బీజేపీ రెండుసార్లు గెలిచిన సంగతి తెలిసిందే. లోక్‌సభకు రెం డుసార్లు, అర్బన్ ఎమ్మెల్యే స్థానం నుంచి ఒకసారి గెలిచింది. రెండుసార్లు టీడీపీతో పొత్తు వల్లే గెలిచింది. ఈసారి ఏకంగా టీడీపీ-జనసేన కూడా కలవడంతో బీజేపీ అభ్యర్థికి బాగా బలం పెరిగినట్లయింది. ఈ లోక్‌సభ స్థానం గోదావరికి ఆటూఇటూ ఉన్న ప్రాంతం. ఈస్థానం టీడీపీకి కంచుకోట. పోల్‌మేనేజ్‌మెంట్, వర్గాల సమీకరణ వ్యూహాత్మకంగా ఉంటే టీడీపీ నుంచి ఈ స్థానాన్ని ఎవరూ తన్నుకుపోలేనంత క్యాడర్ టీడీపీకి ఉంది. తెలుగుదేశం పార్టీ ఏర్పడిన తర్వాత 1984 నుంచి 2019వరకూ జరిగిన పది లోక్‌సభ ఎన్నికలలో టీడీపీ మూడుసార్లు, బీజేపీ రెండుసార్లు, కాంగ్రెస్ నాలుగుసార్లు, వైసీపీ ఒకసారి గెలిసింది. గెలిచిన ప్రతీసారీ ఓట్లశాతం పరిశీలించినా, మెజా ర్టీ శాతం పరిశీలించినా టీడీపీకే అధికంగా ఓట్లు తెచ్చుకోవడం గమనార్హం. రాష్ట్ర విభజన తర్వాత మొదటగా జరిగిన సార్వత్రిక ఎన్నికలలో రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం నుంచి ప్రముఖ సినీనటుడు మాగంటి మురళీమోహన్ ఘన విజయం సాధించారు. అప్పట్లో 6,30,573 ఓట్లు అంటే 54.62 శాతం ఓట్లు సాధించారు. అంతకుముందు జరిగిన ఎన్నికల కంటే అదనంగా 19.72శాతం సాధించారు. 2009 ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి ఉండవల్లి అరుణకుమార్ చేతిలో కేవలం 2,147 ఓట్ల తేడాతో మురళీమోహన్ ఓడిపోయిన సంగతి తెలిసిందే. 2014లో జరిగిన ఎన్నికలలో ఇంతవరకూ ఎవరికీ రానంత మెజార్టీ ఆయనకు వచ్చింది. ఏకంగా 1,67,434 ఓట్ల మెజార్టీ లభించింది. ఇది 14.29శాతం మెజార్టీ. అప్పట్లో వైసీపీ తరపున పోటీ చేసిన బొడ్డు వెంకటరమణకు 4,63,139 ఓట్లు వచ్చాయి. అది 40.12శాతం. కానీ 2019లో తెలుగుదేశం, జనసేన వేర్వేరుగా పోటీచేసి దెబ్బతిన్నాయి. టీడీపీ తరపున మాగంటి మురళీమోహన్ కోడలు మాగంటి రూప పోటీచేసి 4,60,390ఓట్లు అంటే 36.82శాతం తెచ్చుకోగలిగారు. జనసేన అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ పోటీ చేసి, 1,55,807 ఓట్లు అంటే 12.46శాతం సాధించారు. ఈ ఇద్దరి మధ్య ఓట్లు చీలిపోవడంతో వైసీపీ అభ్యర్థి మార్గాని భరత్ 5,82,024 ఓట్లు అంటే 46.55శాతం ఓట్లు సాధించి, 1,21,634 ఓట్లు మెజార్టీ సాధించారు. ఇది 9.73శాతం మెజార్టీ.. ఈసారి ఈ లెక్కలేకాక, అధికారపార్టీ మీద ఉన్న ప్రజలలో వ్యతిరేకత, టీడీపీ, జనసేన, బీజేపీ ఐక్యతవల్ల ఉమ్మడి అభ్యర్థి బలమే ఎక్కువ ఉంటుంది. ఇక్కడి నుంచి వైసీపీ అభ్యర్థిగా డాక్టర్ గూడూరి శ్రీనివాసరావు బరిలో ఉన్న సంగతి తెలిసిందే. ఇక కాంగ్రెస్ నుంచి పీసీసీ మాజీ అధ్యక్షుడు, సీ డబ్ల్యూసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు ఇక్కడ బరిలోకి దిగారు. ఇక్కడ పోటీ రసవత్తరంగా మారింది. కూటమి బలంగా బాగా పెరగగా, కాంగ్రెస్ అభ్యర్థి వల్ల ఇప్పటికే కష్టాలలో ఉన్న వైసీపీ అభ్యర్థికి మరింత నష్టం జరిగే అవకాశం ఉన్నట్టు పరిశీలకుల అంచనా. జిల్లాలో ఇప్పటి వర కూ మొత్తం ఓటర్ల సంఖ్య 16,16,918మంది ఓటర్లు ఉన్నారు. అందులో మహిళలు 8,27,380 మంది, పురుషులు 7,89,443మంది ఉన్నారు. వీరంతా ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

రాజమహేంద్రవరం లోక్‌సభ చరిత్ర

రాజమహేంద్రవరం లోక్‌సభకు 1952లో తొలిసారి ఎన్నికలు జరిగాయి. అప్పుడు ద్విసభ్య నియోజకవర్గంగా ఉండేది. తొలి ఎన్నికలలో సోషలిస్ట్ పార్టీ తరపున నల్లా రెడ్డినాయుడు, కమ్యూనిస్ట్ పార్టీ నుంచి కానేటి మోహనరావు విజయం సాధించారు. తర్వాత కాంగ్రెస్, టీడీపీ హవా కొనసాగింది. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుంచి 1957, 1962లో దాట్ల సత్యనారాయణరాజు, 1967, 1971, 1997, 1980లలో ఎస్‌బీపీ పట్టాభి రామారావు విజయం సాధించారు. 1984లో టీడీపీ అభ్యర్థి చుండ్రు శ్రీహరి గెలిచారు. 1989లో ప్రముఖ సినీనటి జమున కాంగ్రెస్ తరపున గెలవగా, 1991లో టీడీపీ అభ్యర్థి కేవీఆర్ చౌదరి గెలిచారు. 1996లో మళ్లీ కాంగ్రెస్ అభ్యర్థి చిట్టూరి రవీంద్ర విజయం సాధించారు. తర్వాత 1998లో తొలిసారి బీజేపీ అభ్యర్థి గిరజాల వెంకటస్వామినాయుడు గెలిచారు. 1999లో మళ్లీ ఎన్నికలు జరగగా, టీడీపీ మద్దతుతో బీజేపీ అభ్యర్థి ఎస్‌బీపీబీకే సత్యనారాయణరావు గెలిచారు. 2004, 2009లో కాంగ్రెస్ అభ్యర్థి ఉండవల్లి అరుణకుమార్ విజయం సాధించారు. 2014లో టీడీపీ అభ్యర్థి మాగంటి మురళీమోహన్ గెలుపొందారు. 2019లో మాత్రం వైసీపీ అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ గెలిచారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో

పవన్ పర్యటన షెడ్యూల్ ఖరారు



పిఠాపురం, ఏప్రిల్ 18: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పర్యటన షెడ్యూల్ ఖరారయింది. ఆయన వివిధ ప్రాంతాల్లో జరిగే బహిరంగసభల్లో పాల్గొంటారు. 20వ తేదీన పిఠాపురంలో టీడీపీ నేతలతో జరిగే సమావేశానికి హాజరై అనంతరం రాజానగరంలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. 23న పిఠాపురంలో నామినేషన్, సాయంత్రం ఉప్పాడలో జరిగే బహిరంగసభలోనూ పాల్గొంటారు. 26న రాజోలు, రామచంద్రాపురం, 27న పెద్దాపురం, కాకినాడ రూరల్, 28న జగ్గంపేట. ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో జరిగే బహిరంగసభల్లో పవన్ పాల్గొని టీడీపీ, జనసేన అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహిస్తారు. మే 4న తుని, పిఠాపురం సభల్లో పాల్గొంటారు. మే 10న పిఠాపురం, 11న కాకినాడ అర్బన్ నియోజకవర్గంలో రోడ్‌షోలో పాల్గొని అక్కడ జరిగే సభల్లో ప్రసంగిస్తారు. కాకినాడ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో పవన్‌సభలు ఉండనున్నాయి. ఇక్కడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ పోటీ చేస్తుండటంతో అన్ని అసెంబ్లీ సెగ్మెంట్‌లలోనూ పవన్ ప్రచారం నిర్వహిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.

వైసీపీ చెంప మీద ఓటుతో కొట్టాలి

- పిఠాపురం పవర్ అంటే ఇదిరా అని చూపాలి
- లక్ష మెజార్టీతో పవన్ విజయం సాధిస్తారు: సినీ నటుడు పృథ్వీరాజ్


సమావేశంలో మాట్లాడుతున్న సినీనటుడు పృథ్వీరాజ్

పిఠాపురం, ఏప్రిల్ 18: మే 13న జరుగనున్న ఎన్నికల్లో వైసీపీ చెంప మీద ఓటుతో కొట్టాలి. పిఠాపురం పవర్ అంటే ఇదిరా అని చూపాలి అని సినీనటుడు, జనసేన స్టార్ క్యాంపైనర్ పృథ్వీరాజ్ అన్నారు. ఇక్కడి నుంచే జనసేన అధినేత పవన్‌కల్యాణ్ లక్ష మెజార్టీతో గెలవడం ఖాయమని చెప్పారు. కష్టాలన్నీ అధిగమించిన పవన్ అసెంబ్లీలో అడుగు పెట్టడం ఖాయమని తెలిపారు. పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో ఆయన గురువారం పూజలు నిర్వహించారు. అనంతరం కుమారపురంలోకి గోకులం గ్రాండ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీలో ప్రస్తుతం ఉన్న నాయకులు అంతా దాచుకోవడం, దోచుకోవడానికే పనిచేస్తున్నారు తప్ప ప్రజల కోసం కాదని విమర్శించారు. ప్రజల కోసం నిరంతరం తపించి వారి కోసం పనిచేసే నాయకుడు పవన్‌కల్యాణ్ అన్నారు. పిఠాపురాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దగల సత్తా పవన్‌కే ఉందన్నారు. తాను మే 11వ తేదీ వరకూ పిఠాపురం నియోజకవర్గంలో ఉండి పవన్ తరపున ప్రచారం చేస్తానని తెలిపారు. త్వరలోనే మరింత మంది స్టార్లు రాబోతున్నారని, ప్రచారం వేరే లెవెల్‌లో ఉంటుందని చెప్పారు. 2014 కూటమి రిజల్ట్ మరలా రీపీట్ అవుతుందని తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే రాష్ట్రంలో శాంతిభద్రతలు, అభివృద్ధి, సంక్షేమం, మహిళలకు భద్రత, రైతులకు భరోసా సాధ్యమని చెప్పారు. సమావేశంలో జనసేన నియోజకవర్గ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాసరావు, నాయకులు కడారి తమ్మయ్యనాయుడు, వెన్నపు చక్రధరరావు, సూరవరపు సురేష్, తోలేటి శిరీష, మార్నీడి రంగబాబు పాల్గొన్నారు.

వానాకాలం కాదు.. బురదనీరు ఎక్కడిదబ్బా!


నిడదవోలులో నీటితో నిండిపోయిన రోడ్డులోనే ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు ఊరేగింపు

- నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు ఊరేగింపునకు ఎదురొచ్చిన సమస్య

నిడదవోలు, ఏప్రిల్ 18 : వైసీపీ ప్రభుత్వంలో సమస్యలు స్వాగతం చెబుతాయి.. ఎందుకంటే అభివృద్ధి శూన్యం కదా.. నిడద వోలులో మంచినీటి పైప్‌లైన్లు తరచూ పగిలిపోతుంటాయి.. జనం ఫిర్యాదులు చేస్తుంటారు.. మునిసిపల్ సిబ్బంది మరమ్మతులు చేస్తుంటారు. అయితే పాలకులు మాత్రం శాశ్వత పరిష్కారం చూపరు.. ఆ నిర్లక్ష్యమే నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస నాయుడికి సమస్యగా ఎదురొచ్చింది. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు గురువారం రెండోసారి నిడదవోలు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసేందుకు ఊరేగింపుగా బయలుదేరారు. అయితే నిడదవోలు మెయిన్ రోడ్డుపైకి వచ్చేసరికి ఆ రోడ్డంతా బురదనీటితో నిండి ఉంది.. వర్షాకాలం కూడా కాదు రోడ్డుపైకి బురదనీరు ఎలా వచ్చిందంటారా.. ఇంకెక్కడిది మళ్లీ పాత సమస్యే..ఆ రోడ్డులో వాటర్ పైప్‌లైన్ బుధవారం పగిలింది. ఆ పైప్‌లైన్‌కు గురువారం మరమ్మతులు చేయడంతో ఆ నీరంతా ఇలా రోడ్డుపై పారింది. ఆ బురద నీటిలోనే ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, వైసీపీ నాయకులు ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఎన్నికల్ రిటర్నింగ్ అధికారి ఆర్.వి.రమణ నాయక్‌కు నామినేషన్ అందజేశారు. బురదనీటిలో నడుస్తూ నామినేషన్ వేయడానికి వెళ్లిన వీడియో నెట్టింట హల్‌చల్ చేసింది. దీంతో నెటిజన్లు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు గత 30 ఏళ్ళుగా ప్రజాసేవలో ఉంటూ నిడదవోలు పట్టణాన్ని ఎంతో అభివృద్ధి చేశారని ఎన్నికల ప్రచారంలో ఊదరగొడుతున్నారు ఇదేనా అంటూ ప్రశ్నించడం కొసమెరుపు.

టీడీపీలో కొయ్యా శ్రీనుబాబు చేరిక


టీడీపీలో చేరిన శ్రీనుబాబు అనుచరగణంతో యనమల రామకృష్ణుడు

తునిరూరల్, ఏప్రిల్ 18: ఇటీవల వైసీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పదవికి రాజీనామా చేసిన కొయ్యా శ్రీనుబాబు టీడీపీలో చేరారు. ఈయన గత ఎన్నికల్లో మంత్రి రాజా గెలుపులో కీలకంగా ఉన్నారు. గురువారం రాష్ట్ర శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు సమక్షంలో తేటగుంట టీడీపీ కార్యాలయంలో ఆపార్టీలో చేరారు. ఆయనకు రామకృష్ణుడితోపాటు తుని కూటమి అభ్యర్థి యనమల దివ్య పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన శ్రీనుబాబు మాట్లాడుతూ కోన ప్రాంత అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని టీడీపీతో ఆ ప్రాంతవాసులకు న్యాయం జరుగుతాదన్న నమ్మకం తనకు ఉన్నట్లు వెల్లడించారు. రానున్న ఎన్నికల్లో కూటమి ఉమ్మడి అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. టీడీపీ యువనేత యనమల రాజేష్, సీనియర్ నాయకులు కరప అప్పారావు, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, చింతమనీడి నాగ సోమరాజు ఉన్నారు.

వైసీపీకి రాజవొమ్మంగి జడ్పీటీసీ రాజీనామా


సమావేశంవలో మాట్లడుతున్న జడ్పీటీసీ వడుగుల జ్యోతి

రాజవొమ్మంగి, ఏప్రిల్ 18: ఏజెన్సీలో వైసీపీకి వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. మండలంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని నాగులాపల్లి ధనలక్ష్మి గురువారం ఎన్నికల ప్రచారం చేయగా ఈరోజే ఆ పార్టీకి జడ్పీటీసీ రాజీనామా చేశారు. ఇప్పటికే ఐదు నెలల కిందట వైసీపీకి చెందిన 250మంది నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరగా తాజాగా రాజవొమ్మంగి వైసీపీ జడ్పీటీసీ వడుగుల జ్యోతి, ఆమె భర్త రవి, మాజీ సర్పంచ్ చీడిపల్లి అప్పారావు వైసీపీకి రాజీనామా చేశారు. వైసీపీ నాయకత్వంలో సమన్వయ లోపం కారణంగా తమకు ఏ విషయం తెలియట్లేదని, దీనివల్ల రాజీనామా చేస్తున్నామని జడ్పీటీసీ వడుగుల జ్యోతి తెలిపారు. ప్రతి కార్యక్రమంలో తమకు అవమానాలు తప్ప గుర్తింపు లేదని రాజవొమ్మంగి మాజీ సర్పంచ్ చీడిపల్లి అప్పారావు తెలిపారు.

ఘనంగా నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠా పూజలు

- తొలిరోజు జలాధివాసంలో ధ్వజస్తంభం


ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజలు నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం, ఏప్రిల్ 18: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠా వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజున ధ్వజస్తంభాన్ని జలాధివాసంలో ఉంచి పండితులు పూజలు నిర్వహించారు. ఉదయం 11గంటలకు గణపతిపూజతో కార్యక్రమం ప్రారంభించారు. పుణ్యాహవచనం, దీక్షావస్త్రధారణ, మండపారాధనలు నిర్వహించారు. రావిచెట్టు ప్రక్కనే నూతన యాగశాలను ఏర్పాటుచేసి యాగక్రతువులు చేపట్టారు. సుమారు 58మంది పండితులు ఈక్రతువును నిర్వహిస్తున్నారు. ముందుగా స్వామి,అమ్మవార్లను మేళతాళాలతో యాగమండపం వద్దకు తోడ్కొనివచ్చారు. తొలగించిన ధ్వజస్తంభం నుంచి కళాన్యాసం గావించిన కలశను ఉంచి పూజలు చేశారు. ఈవో రామచంద్రమోహన్, నెల్లూరుకు చెందిన దాత కుటుంబసభ్యులతో రుత్విక్‌లు పూజలను నిర్వహించారు. చతుర్వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. రెండవరోజైన శుక్రవారం క్షీరాధివాసంలో ద్వజస్తంభం ఉంచి పూజలు నిర్వహించనున్నారు.

వాడపల్లి వెంకన్న కల్యాణం.... చూసొద్దాం రండి

- నేడు తీర్థం, రథోత్సవం, కల్యాణం


ధ్వజారోహణం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఏప్రిల్ 18: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దివ్య కల్యాణ మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నాలుగుగంటలకు స్వామివారి మేలుకొలుపు, నిత్యార్చన, నిత్య బలిహరణ, బాలభోగం, నివేదన జరిపి దర్శనాలకు అనుమతించారు. సాయంత్రం 5.30కు వసంత మండపంలో విశ్వక్సేన పూజ, ఆరాధన, పుణ్యాహవాచనం, దీక్షాధారణ, అంకుర్పారణ, వాస్తు పూజ, అగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజా రోహణ, బలిహరణ జరిపారు. వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం ఖండవల్లి రాజేశ్వరవర ప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు, అర్చకులు ధ్వజ పతాకాన్ని ఎగురవేసి కల్యాణోత్సవాలకు శ్రీకారంచుట్టారు. శుక్రవారం ఉదయం పెండ్లి కుమా రుడిని చేస్తారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన రథంపై శ్రీవారు తిరు వీధుల్లో విహరిస్తారు. తీర్థం కూడా జరుగుతుంది. రాత్రి శ్రీనివాస ప్రాంగణంలోని కల్యాణ వేదికపై కల్యాణాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. ఉప కమిషనర్, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. వివిధ రాష్ట్రాల కళాకారులు తమ ప్రదర్శనలతో అలరించనున్నారు. వివిధ శాఖల అధికారులు, పోలీసులు ఏర్పాట్ల నిర్వహణలో నిమగ్నమయ్యారు.

రూ.7.86 లక్షలు విలువైన గోవా మద్యం సీజ్


ఆలమూరులో సీజ్ చేసిన గోవా మద్యంతో అధికారులు

ఆలమూరు, ఏప్రిల్ 18: ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టడానికి నాయకులు సిద్ధమవుతు న్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరులో వైసీపీ నేతకు చెందిన ఇటుకల బట్టీ వద్ద మద్యం నిల్వ చేసినట్టు అందిన సమాచారంతో స్పెషల్ టీం గురువారం ఉదయం దాడిచేసి రూ.7,86,100 విలువైన 130 కేసుల గోవా రాష్ట్రం మద్యాన్ని స్వాధీనం చేసుకుంది. ఆల మూరు మండల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి పోసమ్మ, ఏఈఎస్ అమర్ బాబు, రాజోలు సీఐ శ్రీనివాస్. ఎస్ఈబీ ఆలమూరు ఎస్‌హెచ్‌వో సత్యవాణి, స్పెషల్ టీం సభ్యులు, రెవెన్యూ అధికారులు దాడిలో పాల్గొన్నారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని విచారణచేస్తున్నట్టు ఎస్ఈబీ ఎస్‌హెచ్‌వో సత్యవాణి చెప్పారు.

యానాంలో 19న ఓటు వేయవచ్చు

- ఏపీలో పనిచేసే వాళ్లకు అవకాశం

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్18: యానాంలో ఓటుహక్కు కలిగి ఉండి ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు, వ్యాపారులు ఈనెల 19న యానాంలో ఓటు వేయవచ్చునని కాకినాడజిల్లా కలెక్టర్ నివాస్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల మొదటి పోలింగ్ సందర్భంగా యానాంలో ఓటు వేయవచ్చునన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వేతనంతో కూడిన సెలవు కూడా మంజూరు చేసిందని చెప్పారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
FLATS FOR SALE
నిడదవోలు, గాంధీనగర్, లయన్స్ కంటి ఆసుపత్రి రోడ్ సూర్య రెసిడెన్సీ నందు డబుల్ బెడ్‌రూం ఫ్లాట్స్ ఫస్ట్ ఫ్లోర్ మరియు సెకండ్ ఫ్లోర్ E/F అమ్మకమునకు కలవు, నో బ్రోకర్స్, కాంటాక్ట్ నెం: 9441037735.
Ajd:177176

4 Lines CLASSIFIED Rs.230/- Only

నేడు కాకినాడ జిల్లాలో సీఎం బస్సు యాత్ర

- కాకినాడ రూరల్‌లో మేమంతా 'సిద్ధం' సభకు చురుగ్గా ఏర్పాట్లు

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 18: ఎన్నికల ప్రచారంలో భాగంగా కాకినాడ జిల్లాలో ముఖ్యమంత్రి జగన్ బస్సు యాత్ర శుక్రవారం ప్రవేశించనుంది. సిద్ధం బహిరంగ ఏర్పాట్లు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే వైసీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో చురుగ్గా సాగుతున్నాయి. తిమ్మాపురం పంచాయతీ పరిధిలో ఖాళీ స్థలంలో జరిగే 'మేము సిద్ధం' సభ కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం జగన్ ప్రసంగించే సభావేదిక, సభాప్రాంగణంవద్ద పటిష్ట ఏర్పాట్లు చేశారు. సభా ప్రాంగణం ఏర్పాట్లను ఎమ్మెల్యే కన్నబాబు, గ్రామ సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, జడ్పీటీసీలు యాళ్ల సుబ్బారావు, నులుకుర్తి రామకృష్ణ, ఎంపీపీ గోపిశెట్టి పద్మజబాబ్జీ, పెంకే శ్రీలక్ష్మీసత్తిబాబు, ఏఎంసీ ఛైర్మన్ గీసాల శ్రీనులు పర్యవేక్షిస్తున్నారు.

సీఎం పర్యటన సాగేదిలా..

కాకినాడ రూరల్ నియోజకవర్గంలో సీఎం జగన్ శుక్రవారం ఉదయం చేరుకుంటారు. బస్సు యాత్ర ద్వారా ఉదయం ఎస్‌టీ రాజపురం నుంచి బయలుదేరి పెద్దాపురం బైపాస్, సామర్లకోట బైపాస్ మీదుగా ఉండూరు చేరుకుంటారు. ఇక్కడ భోజన విరామం తీసుకుంటారు. జిల్లాకు చెందిన మంత్రి, ఎమ్మెల్యేలతో మాట్లాడిన తర్వాత ఉండూరు క్రాస్, కాకినాడ బైపాస్ రోడ్డు మీదుగా సాయంత్రం 3.30 గంటలకు కాకినాడ రూరల్ అచ్చంపేట జంక్షన్ వద్దకు చేరుకుంటారు. ఇక్కడ ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన మేమంతా సిద్ధం బహిరంగ సభలో ప్రసంగిస్తారు. సభ తర్వాత ఇక్కడినుంచి బయలుదేరి పిఠాపురం బైపాస్, గొల్లప్రోలు బైపాస్, కత్తిపూడి బైపాస్, తుని బైపాస్‌ల మీదుగా ప్రజలకు బస్సు యాత్ర ద్వారా అభివాదం చేస్తూ వెళ్తారు. తునిలో ముగించుకుని పాయకరావుపేట బైపాస్ మీదుగా గొడిచర్ల క్రాస్‌లో రాత్రి బస శిబిరానికి చేరుకుంటారని ఎమ్మెల్యే కన్నబాబు తెలిపారు.

అనుమతులు లేకుండానే సిద్ధం ఫ్లెక్సీల ఏర్పాటు



పిఠాపురం, ఏప్రిల్ 18: సీఎం జగన్ జిల్లా పర్యటనలో భాగంగా అచ్చంపేటవద్ద శుక్రవారం జరిగే బహిరంగసభ తర్వాత బస్సులో చిత్రాడ, పిఠాపురం, గొల్లప్రోలు, చేబ్రోలు బైపాస్ రోడ్డుల మీదుగా వెళ్లనున్నారు. బైపాస్‌రోడ్డు ప్రాంతాల్లో పలుచోట్ల జగన్ సిద్ధం ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. వీటికి అనుమతులు తీసుకోలేదని సమచారం. వైసీపీ నేతలు నిబంధనలు ఉల్లంఘించి ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గుర్తు తెలియని వాహనం ఢీకొని

ఇద్దరు యువకుల దుర్మరణం


ప్రమాదంలో మృతి చెందిన యువకులు


లాలం సతీష్ (ఫైల్)


బర్రి మాధవ్‌కుమార్ (ఫైల్)

పెద్దాపురం, ఏప్రిల్ 18: పెద్దాపురం - రాజమహేంద్రవరం ఏడీబీ రహదారిలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు దుర్మరణం పాలుకాగా మరో యువకుడు తీవ్ర గాయాలపాలైన ఘటన గురువారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లికి చెందిన లాలం సతీష్(20), విశాఖపట్టణానికి చెందిన బర్రి మాధవ్‌కుమార్(19), శ్రీకాకుళం జిల్లా చిగురువలసకు చెందిన మరో స్నేహితుడు రామచంద్రరావు ముగ్గురూ కాకినాడ జిల్లా పెద్దాపురం పట్టణానికి వచ్చారు. తిరిగి మోటార్‌సైకిల్‌పై రూమ్‌కు వెళ్తుండగా వారి ని మార్గమధ్యలో గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొట్ట డంతో మాధవ్, సతీష్ ఇద్దరు యువకులు అక్కడికక్కడే కిందపడి మృతి చెందగా మరో యువకుడు నక్కా రామచంద్ర రావు తీవ్ర గాయాలపాలయ్యాడు. బైక్‌ను ఢీకొట్టిన వాహనం సంఘటనా స్థలంనుంచి ఆగకుండా వెళ్లిపోయింది. మృతిచెందిన యువకులు రామేశంపేటలో గది అద్దెకు తీసుకుని చదువుకుంటున్నారు. మృతిచెందిన యువకులు ఇంజనీరింగ్ చదువుతున్నారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ఢీకొట్టిన వాహనం వివరాల కోసం విచారణ చేపట్టారు. క్షతగాత్రుడిని స్థానిక ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మృతదేహాలను స్థానిక ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏజెన్సీ సమాచారం

ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ



నామినేషన్ స్వీకరిస్తున్న రిటర్నింగ్ అధికారి

రంపచోడవరం, ఏప్రిల్ 18: అల్లూరి జిల్లా రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి గురువారం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. తొలిరోజు స్వతంత్ర అభ్యర్థులుగా ఇద్దరు తమ నామినేషన్లను దాఖలు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రశాంత్‌కుమార్‌కు తొలి నామినేషన్‌ను పాలడుగు లక్ష్మీ ప్రసన్న దాఖలు చేయగా, రెండో నామినేషన్ ఆమె తండ్రి పాలడగు వెంకటేశ్వరరావు దాఖలు చేశారు. నామినేషన్ల ప్రక్రియకు ముందు రిటర్నింగ్ అధికారి రంపచోడవరం నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 18 నుంచి 25 వరకూ నామినేషన్లను స్వీకరిస్తామని, ఈ నెల 26న నామినేషన్ల పరిశీలన, 29 వరకూ ఉపసంహరణకు అవకాశం ఉందని చెప్పారు. రంపచోడవరం గిరిజనులకు రిజర్వుడు నియోజకవర్గం అయినందున అర్హులైన అభ్యర్థులు రూ.5 వేలు మాత్రమే దరావత్తు చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు కేసుల్లో గంజాయి స్వాధీనం

మోతుగూడెం, ఏప్రిల్18: వేర్వేరు కేసుల్లో ముందస్తు వచ్చిన సమాచారం మేరకు 62 కిలోల గంజాయిని డొంకరాయి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి ఎస్‌ఐ శివకుమార్ తన సిబ్బందితో డొంకరాయి పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న చెక్‌పోస్టు వద్ద వై.రామవరం డిప్యూటీ తహసీల్దార్ సుధాకరరావు, వీఆర్వో సందీపాచార్యులు ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎన్టీఆర్ జిల్లా కంచకరకి చెందిన పెనుమల బాబు, పర్వతం సురేష్ బైక్‌పై సీలేరు వైపు నుంచి డొంకరాయి వైపునకు వస్తుండగా డొంకరాయి పోలీస్‌స్టేషన్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీ చేయడగా బైక్ డిక్కీలో రూ.10 వేలు విలువైన 2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, బైక్ సీజ్ చేసి బాబు, సురేష్‌లను అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అలాగే మంగంపాడు నుంచి డొంకరాయి వైపు వస్తున్న ఆటోలో 3 ప్లాస్టిక్ బ్యాగుల్లో 60 కిలోల గంజాయిని అక్రమంగా తరలిస్తున్న బర్రిగూడ గ్రామానికి చెందిన కిలోరాం దాస్, తెలంగాణ చిట్యాలకి చెందిన గగ్గ్రే కృష్ణలను అరెస్టు చేసి రూ.3.30 లక్షలు విలువైన 60 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని రాందాస్, కృష్ణలను రిమాండ్‌కి తరలించారు. నిందితులను చాకచక్యంగా పట్టుకోవడంలో ప్రతిభ చూపిన హెడ్ కానిస్టేబుల్ కల్యాణ్, ఐ.శ్రీనివాసరావు, ఆర్.శ్రీనివాస్‌గౌడ్, కానిస్టేబుల్స్ పోసయ్య, గంగరాజులను ఎస్‌ఐ శివకుమార్, సీఐ గజేంద్రకుమార్, చింతూరు అడిషన్ ఎస్పీ రాహుల్‌మీనాలు అభినందించారు.

సహాయ కేంద్రం ఏర్పాటు

రంపచోడవరం, ఏప్రిల్18: రంపచోడవరం నియోజకవర్గంలో అభ్యర్థిగా పోటీ చేయాలనుకునే వారి సహాయార్థం రంపచోడవరం సబ్ కలెక్టరు కార్యాలయంలో ఇద్దరు అధికారులతో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రశాంత్‌కుమార్ తెలిపారు. నామినేషన్ దాఖలుకు అవసరమైన పత్రాలను ఇవ్వడంతో పాటు ఏఏ పత్రాలను వాటికి జత చేయాలన్న విషయాలను కూడా ఆయా అభ్యర్థులకు తెలియజేస్తూ అవసరమైన సహాయాన్ని వారికి అందజేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని రిటర్నింగ్ అధికారి పేర్కొన్నారు.

నేడు టీడీపీ అభ్యర్థి నామినేషన్

రంపచోడవరం, ఏప్రిల్ 18: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి మిరియాల శిరీషాదేవి తెలుగుదేశం అభ్యర్థిగా శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ మేరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏజెన్సీ 11 మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలన్నారు. కూటమి నాయకులు ఆ మేరకు రంపచోడవరంలో తగు ఏర్పాట్లు చేస్తున్నారు.

సీతారాములకు చక్రస్నానం



పూజల్లో పాల్గొన్న మహిళలు

మోతుగూడెం, ఏప్రిల్18: చింతూరు మండలం మోతుగూడెం శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణం అనంతరం గురువారం స్థానికులు సీలేరు నదిలో చక్రస్నానం చేయించారు. ఈ సందర్భంగా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో పెరుమాళ్ళ దేవుడు కొట్టు శ్రీనివాసరావు, చంద్రశేఖర్, పాండే మల్లి, ఏపీజెన్కో ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రగులుతున్న కార్చిచ్చు



మోతుగూడెం, ఏప్రిల్ 18: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో గోపాలపురం గొడ్లగూడెం రహదారిపై అడవిలో రగులుతున్న కార్చిచ్చుకు రహదారిపై వృక్షం నేలకొరింది. దీంతో వైజాగ్, రాజమండ్రి, భద్రాచలం వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారిపై అడ్డంగా ఉన్న వృక్షాన్ని తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఏకలవ్య స్కూల్ ప్రవేశ పరీక్షలు

వై.రామవరం, ఏప్రిల్ 18: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 6,7,8,9 తరగతులకు రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో ఉన్న పరీక్షా కేంద్రాల్లో 20వ తేదీన ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు కన్వీనర్, ప్రిన్సిపాల్ శ్రీపాదరామకృష్ణ తెలిపారు. రంపచోడవరంలో గురుకుల బాలికల, బాలుర పాఠశాలలు, రాజవొమ్మంగి గురుకుల బాలిక పాఠశాల, చింతూరు గురుకుల బాలుర(పీటీజీ) పాఠశాల, ఏకలవ్య కోఎడ్యుకేషన్ పాఠశాలల్లోని కేంద్రాల్లో ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్షలు జరుగుతాయన్నారు.

నలుగురికే అనుమతి

రంపచోడవరం, ఏప్రిల్ 18: స్థానిక సబ్ కలెక్టరు కార్యాలయంలో నామినేషన్స్ వేసే అభ్యర్థితో మరో నలుగురికే అనుమతి ఉంటుందని ఏఎస్పీ జగదీష్ అడహళ్లి తెలిపారు. సబ్ కలెక్టరు కార్యాలయం వద్ద ఎన్నికలకు సంబంధించి ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సబ్ కలెక్టరు కార్యాలయ పరిసరాలను పరిశీలించారు.

అనపర్తిలో రూ.87 వేలు స్వాధీనం

అనపర్తి, ఏప్రిల్ 18 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నియమించిన స్క్వాడ్ బృందాలు వాహన తనిఖీలను ముమ్మరం చేశాయి. అనపర్తిలోని కెనాల్ రోడ్డులో గురువారం నిర్వహించిన తనిఖీలలో అనుమతిని మించి రవాణా చేస్తున్న రూ.87 వేల నగదును స్వాదీనం చేసుకున్నారు. కొప్పవరం గ్రామానికి చెందిన మల్లిడి బాబి మోటార్ సైకిల్ నుంచి స్క్వాడ్ అధికారుల బృందం నగదును స్వాధీనం చేసుకున్నారు. అధికారిణి పద్మావతి మాట్లాడుతూ ఈ నగదును స్థానిక పోలీస్ స్టేషన్‌లో జమచేస్తామని నగదుకు సంబందించిన పత్రాలు చూపించి నగదును తిరిగి పొందవచ్చని ఆమె తెలిపారు.

శాడిస్ట్ పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పించాలి

● ఆత్మీయ సమావేశంలో పురందేశ్వరి

కోరుకొండ, ఏప్రిల్ 18: రాష్ట్రంలో కొనసాగుతున్న శాడిస్ట్ పరిపాలనను తుది ముట్టించి జనసేన, బీజేపీ, టీడీపీ కూటమిని అధికారంలోకి తీసుకొచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధిచేసుకుందామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి దగ్గుపాటి పురందేశ్వరి పిలుపునిచ్చారు. గురువారం కోరుకొండ మండలం బూరుగుపూడి ద్వారకామాయి కల్యాణ మండపంలో జరిగిన జనసేన, టీడీపీ, బీజేపీ ఆత్మీయ సమావేశంలో తాను ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గత 10రోజుల క్రితం జరగాల్సిన ఆత్మీయ సమావేశం బ్యానర్‌పై బొడ్డు వెంకటరమణచౌదరి ఫొటో లేదని కొందరు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆత్మీయ సమావేశాన్ని బహిష్కరించడంతో వాయిదాపడ్డ ఆత్మీయ సమావేశం బొడ్డు వెంకటరమణచౌదరి ఆధ్వర్యంలో ఈరోజు నిర్వహించారు. అప్పట్లో బొడ్డు వెంకటరమణ చౌదరి విదేశాల్లో ఉండటంతో ఇక్కడ సమావేశాన్ని కార్యకర్తల తొందరపాటుతో నిర్వహించలేకపోయామని వారి తరుపున తాను బాధ్యత తీసుకుని ఆనాటి సమావేశం జరగనందుకు క్షమాపణ చెబుతున్నానని బొడ్డువెంకటరమణ చౌదరి పేర్కొన్నారు. చిన్నచిన్న సర్దుబాట్లు ఉన్నప్పటికీ అంతా ఏకతాటిపై వచ్చిఈ నాటి సమావేశాన్ని విజయవంతం చేయడం సంతోషంగా ఉందని పురందేశ్వరి పేర్కొన్నారు. ఇదే ఉత్సాహం, ఇదే ఐకమత్యంతో పనిచేసి త్వరలోజరగబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీకూటమిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని బత్తుల బలరామకృష్ణ పిలుపునిచ్చారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రధానిగా, రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో బొడ్డువెంకటరమణచౌదరి, బత్తులబలరామకృష్ణ, నీరుకొండ వీరన్నచౌదరి, మాజీ ఎంపీ చిట్టూరి రవీంద్ర, తనకాలనాగేశ్వరరావు, మాతా సీతారాముడు, మాతా ప్రభు, అడపా వీరబాబు, బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి

కూటమి అభ్యర్థి గోరంట్లను గెలిపించండి

● గోరంట్ల కుమార్తె శిరీష

ధవళేశ్వరం, ఏప్రిల్ 18: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గోరంట్ల బుచ్చయ్యచౌదరిని, బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పురందేశ్వరిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గోరంట్ల కుమార్తె శిరీష ఓటర్లను అభ్యర్థించారు. గురువారం సాయంత్రం స్థానిక కాటన్ పేట నుంచి ఎంప్లాయిస్ కాలనీ వరకు టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతోకలిసి ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి జరగాలంటే గోరంట్ల బుచ్చయ్య చౌదరిని గెలిపించుకోవాలన్నారు. సూపర్‌సిక్స్‌తో కూడిన కరపత్రాలను ఇంటింటా పంపిణీచేశారు.రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనను అంతమొందించేందుకు ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చియ్య చౌదరికి సైకిల్‌గుర్తుపై, ఎంపీ అభ్యర్థి పురందీశ్వరికి కమలం గుర్తుపై ఓటు వేయాలన్నారు.ఈ ప్రచార కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బిక్కవోలులో 50 మంది యువకులు టీడీపీలో చేరిక

బిక్కవోలు, ఏప్రిల్ 18: గ్రామానికి చెందిన 50 మంది యువకులు గురువారం వైసీపీ నుంచి టీడీపీలో చేరారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. వీరికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో కోడూరి రాజా, కర్రి మోహనసాయి, కాకర చంద్రం, శాలుమూరి నరేష్ తదితరులున్నారు. యువత ఎన్నికల్లో కష్టపడి పనిచేసి ఎన్‌డీఏ కూటమిని అధికారంలోకి తీసుకురావాలన్నారు. అనంతరం ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈయన వెంట దేశం నేతలు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, గొర్రెల త్రిమూర్తులు, సింగారపు రామారావు, రాయుడురామచంద్రరావు, వీరబాబు ఉన్నారు.

చంద్రేడులో 25 కుంటుంబాలు టీడీపీలో చేరిక

రంగంపేట: మండలంలోని చంద్రేడు గ్రామంలో 25 కుటుంబాల సభ్యులు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. గురువారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ముమ్మరెడ్డి సత్యనారాయణ వాణి దంపతులు, పోలేపల్లి లచ్చన్న,మల్లిన సత్యవేణి, బిక్కిన జమ్మియ, పుట్టా సత్యనారాయణ, ముమ్మరెడ్డి సుబ్బారావు,శ్రీను,బొడ్డు బుజ్జియ్య, బన్ను యూత్ మరియు 25 కుటుంబాలకు పార్టీకండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ళ గోవింద్, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి నీలపాల త్రిమూర్తులు, సిరసపల్లి నాగేశ్వరారవు,పార్టీ మండల అధ్యక్షుడు వెలుగుబంటి సత్తిబాబు, కార్యదర్శి పూసల శ్రీనివాస్, ఉద్దండ్రావు శ్రీను, ఉండవిల్లి గిరిబాబు, బలిరెడ్డి దుర్గారావు, పోతుల సత్తిబాబు, గ్రామ, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనపర్తిలో ఎన్డీయే కూటమి విజయం ఖాయం

అనపర్తి, ఏప్రిల్ 18 : అనపర్తి నియోజకవర్గంలో ఎన్డీయే కూటమి విజయబావు టా ఎగురవేయడం ఖాయమని కూటమి తరపున టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్ల మిల్లి రామకృష్ణారెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు తమలంపూడి సుధాకరరెడ్డి అన్నారు. గురువారం అనపర్తిలో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహిస్తూ ప్రజలకు సూపర్‌సిక్స్ పథకాలను వివ రించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లిడి శ్రీనివాసరెడ్డి, నూతిక బాబూరావు, మామిడిశెట్టి శ్రీను, గొలుగూరి భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికలు సక్రమంగా నిర్వహించాలి'

అనపర్తి, ఏప్రిల్ 18 : ఎన్నికలు సక్రమంగా నిర్వహించేందుకు అధికారులతో సమన్వయంతో ముందుకు సాగాలని ఎన్నికల నియమావళికి అనుగుణంగా సిబ్బంది పనిచేయాలని రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్లు జయ అరవింద, నితిన్ కోటయ్యలు సూచించారు. గురువారం అనపర్తిలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో వారు ఆకిస్మంగా తనిఖీ చేశారు. ముందుగా నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను పరిశీలించారు. అనంతరం ఆర్వో కార్యాలయంలో ఆర్వో మాదురితో సమావేశమైన వీరు పలు అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంట్ పరిధిలోని రిటర్నింగ్ కార్యాలయాల పనితీరును పర్యవేక్షించేందుకు వచ్చామని ఇక్కడ అధికారులకు కొన్ని సూచనలు సలహాలు అందించామన్నారు. అనపర్తి ఆర్వో కార్యాలయ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. వీరి వెంట పలువురు అధికారులు ఉన్నారు.

నామినేషన్ల ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి

● రాజానగరం రిటర్నింగ్ అధికారి చైత్రవర్షిణి

రాజానగరం, ఏప్రిల్ 18: సార్వత్రిక ఎన్నికలు-2024లో భాగంగా నామినేషన్ల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాజానగరం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి ఎ.చైత్రవర్షిణి తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ నోటిఫికేషన్ గురువారం విడుదల చేశామని, నోటీసు బోర్డులో నోటిఫికేషన్‌ను ప్రదర్శించడం జరిగిందన్నారు. నామినేషన్ దాఖలు చేసే విధానంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలని అన్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు సంబంధించిన గదిలో వీడియో రికార్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే ప్రత్యేక నామినేషన్ల సెల్(హెల్ప్‌డెస్క్) ఏర్పాటు చేశామన్నారు. నామినేషన్ దాఖలు చేసేందుకు నోటిఫైడ్ తేదీల్లో ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3గంటలవరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. నామినేషన్ల దాఖలు సమయంలో 100 మీటర్ల పరిధిలో గరిష్టంగా 3 వాహనాలకు అనుమతిస్తామని, అభ్యర్థితో సహా ఐదుగురు వ్యక్తులను మాత్రమే ఆర్వో ఆఫీసులోకి అనుమతిస్తామన్నారు. నామినేషన్లు వేసేందుకు ఈనెల 25 చివరి తేదీ కాగా, 26న నామినేషన్ల పరిశీలన, 29న ఉపసంహరణ అనంతరం అదేరోజు పోటీలో ఉండే అభ్యర్థుల వివరాలు ప్రకటిస్తామని ఆర్వో చైత్రవర్షిణి తెలిపారు.



ఐదేళ్లుగా లేనిది ఇప్పుడు గుర్తొంచ్చిందా!

● జగన్ రాకతో హడావిడిగా ఏడీబీ రోడ్డుకు మరమ్మతులు

రంగంపేట, ఏప్రిల్ 18 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి బస్సు యాత్ర గురువారం తూర్పుగోదావరిజిల్లాలోకి ప్రవేశించింది. రాజమహేంద్రవరం నుంచి రాత్రికి రాజానగరం సమీపంలో ఉన్న ప్రాంతంలో బస చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా రాజానగరం నుంచి సామర్లకోట వరకు నిర్మిస్తున్న ఏడీబీ రోడ్డు విస్తరణ పనులు గత కొన్ని నెలల నుంచి నిలిచిపోయి రోడ్డు అధ్వానంగా తయారైంది. దీంతో ప్రయాణికులు నరకయాతన అనుభవించారు. ఇంతవరకు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు ఎంత గోలచేసినా పట్టించుకోలేదు. అధికారులు జగన్‌యాత్ర కోసం ఆఘమేఘాలపై హడావిడిగా గురువారం సాయంత్రం తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఇంతకాలం సామాన్యులు రోడ్డులో ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం సాగించారు. వాహనదారులు మోటారుసైకిళ్లు, కార్లు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నా పట్టించుకోని అధికారులు జగన్ బస్సు యాత్రకు మాత్రం హడావిడిగా మరమ్మతులు చేపట్టినందుకు ప్రజలు విరుచుకు పడుతున్నారు. అధికారులు స్పందించి ఏడీబీ రోడ్డుకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ఎస్సీరాజాపురం వద్ద ఏడీబీ రోడ్డుపై తాత్కాలిక మరమ్మతులు దృశ్యం

ఫ్లయింగ్ స్క్వాడ్‌లు అప్రమత్తంగా ఉండాలి

సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు క్షేత్ర స్థాయిలో మద్యం లావాదేవీలు, ఇతర ఉచిత పంపిణీల తీరుపై సూక్ష్మ స్థాయిలో నిఘా పెట్టాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.మాధవీలత ఆదేశించారు. జిల్లా ఎఫ్ఎస్‌టీ బృందంతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించిన ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని 7 నియోజక వర్గాల స్థాయిలో 63 బృందాలు మూడు షిఫ్టుల్లో విధులు నిర్వర్తిస్తున్నాయ న్నారు. వీటికి అదనంగా ఎన్నికల కమిషన్ ఆదేశాలతో జిల్లా స్థాయిలో 10మంది సభ్యులతో జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాన్ని ఏర్పాటు చేశామ న్నారు. ఈ బృందానికి సహాయ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డిని నోడల్ అధికారిగా నియమించామన్నారు. ఇప్పటికే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినందున ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు మరింత అప్రమత్తత, కచ్చితత్వంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. గత ఏడాది ఇదే రోజున ఎంత మద్యం లావాదేవీలు జరిగాయి, వివిధ ఫ్రీబీస్, వస్తువుల వినిమయం ఎంత ఉందో షాపుల వారీగా, ప్రాంతాల వారీగా గణాంకాలను తనిఖీ చేయాలన్నారు. ఇన్‌కం ట్యాక్స్, జీఎస్టీ, ఎస్ఎస్‌టీ శాఖల ఆధ్వర్యంలో రికార్డు లను పరిశీలించి తదుపరి చేపట్టాల్సిన చర్యలపై నివేదిక అందజేయాలని మాధవీలత ఆదేశించారు. ఎఫ్ఎస్‌టీ బృందాలు తనిఖీల వివరాలను ఎప్పటికప్పుడు రిపోర్టు చేయడం అత్యంత అవసరమన్నారు. జిల్లాలోని ఐదు డిస్టిలరీలు, ఒక బ్రూవరీ ద్వారా నిర్వహిస్తున్న కార్యకలాపాలపై సమగ్ర సమాచారం సేకరించాలన్నారు. అమ్మకాలను నియంత్రించే క్రమంలో సీలింగ్ పద్ధతిని అనుసరిస్తున్నామని ఆమె తెలిపారు. సమావేశంలో సహాయ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎం.భానుప్రకాశ్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



నర్మదా పుష్కర క్షేత్రదర్శిని పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 18: శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి కాలేజి రిటైర్డ్ లెక్చరర్ రాజమహేంద్రి మహిళా కళాశాల డైరెక్టర్, మేజర్ చల్లా సత్యవాణి విరచిత నర్మదా పుష్కర క్షేత్రదర్శిని పుస్తకావిష్కరణ కార్యక్రమం గురువారం ఉదయం స్థానిక ఇన్నీసు పేట శ్రీ మహాకాళేశ్వర ఆలయ ప్రాంగణంలో జరిగింది. మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రి గౌరవాధ్యక్షులుగా రాజమహేంద్రి విద్యాసంస్థల కరస్పాండెంట్ టీకే విశ్వేశ్వరెడ్డి అధ్యక్షత వహించారు. రోటేరియన్ పట్టపగలు వెంకట్రావు సదరు గ్రంథాన్ని ఆవిష్కరణ చేశారు.

ఆర్ట్స్ కళాశాలలో వార్షిక సాంస్కృతిక ఉత్సవం

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 18: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వార్షిక సాంస్కృతిక ఉత్సవం ఉద్భవ్ - 2024 గురువారం ప్రారంభమైంది. కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే ఈ ఉత్సవాన్ని ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థులకు సంపూర్ణ విద్యా అనుభవాన్ని అందించే ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులకు సాంస్కృతిక పోటీల ద్వారా వారి విభిన్న ప్రతిభను ప్రదర్శించడానికి ఒక శక్తివంతమైన వేదికగా పనిచేస్తుందని పేర్కొన్నారు. ఫిలాసఫీ లెక్చరర్ సత్యం సూర్యనారాయణ, సైకాలజీ లెక్చరర్ రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్ల వైసీపీ పాలనపై ప్రజల్లో విసుగు

- టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి వాసు
- నామినేషన్ దాఖలు.. తరలి వచ్చిన శ్రేణులు
- కిక్కిరిసిన రాజమహేంద్రవరం రోడ్లు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 18: ఐదేళ్ల జగన్ పాలనపై విసుగు చెందిన ప్రజలు ఈ రోజు రోడ్డు పైకి వచ్చారని వైసీపీ ఇంటికి పోవడం ఖాయమని టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాసు అన్నారు. రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆయన గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ ప్రక్రియ పూర్తి చేసుకున్నాక ఆయన బయటకు వచ్చి విలేకరులతో మాట్లాడారు. ఇది కేవలం ట్రైలర్ మాత్రమేనని అసలు బొమ్మ వచ్చే నెల 13న వైసీపీ దిమ్మదిరిగేలా కనబడుతుందన్నారు. రాజమహేంద్రవరంలో 50 వేల పైచిలుకు మెజార్టీతో తాను విజయం సాధించడం ఖాయమన్నారు. మరో 30 రోజుల్లో కూటమి అధికారంలోకి రాబోతుందని స్పష్టం చేశారు. మండుతున్న ఎండను సైతం లెక్క చేయకుండా వేలాదిగా తరలివచ్చిన టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులకు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గుళకరాళ్లు, రంగురాళ్ల డ్రామాలు చేసిన జగన్ ఇప్పుడు సిగ్గులేకుండా రాజమహేంద్రవరం వస్తున్నాడని అతనికి ఓట్లు అడిగే హక్కులేదన్నారు. తమ ప్రచారంలో భరత్‌రామ్‌కు ఏమిలేదని అనవద్దని, ఎందుకంటే భరత్‌రామ్ చేసిన అవినీతి ప్రజలందరికి తెలుసునన్నారు.

భారీ ఊరేగింపు

రాజమహేంద్రవరంలో ఆదిరెడ్డి శ్రీనివాస్ నామినేషన్ కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు భారీ ఊరేగింపు నిర్వహించారు. సుమారు 20వేల మంది రోడ్లు ఎక్కారు. తిలక్ రోడ్డు నుంచి జేఎన్ రోడ్డు, ఏపీఏ రోడ్డు, గోరక్షణ పేట, స్వామి థియేటర్ రోడ్డు, దేవిచౌక్, గోకవరం బస్టాండ్ ప్రాంతాలన్నీ కార్యకర్తలతో నిండిపోయాయి. దారి పొడవునా పూలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ నగర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొయ్యల రమణ, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవి వరప్రసాద్, ఉమా మార్కండేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ యిన్నమూరి దీపు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాస్, జిల్లా మాజీ అధ్యక్షుడు నక్కా చిట్టిబాబు, మాజీ కార్పొరేటర్ కోడలి రామకృష్ణ, పులిగోరు భద్రం, టీడీపీ నగర ఆర్గనైజింగ్ కార్యదర్శి రవియాదవ్, జనసేన నగర అధ్యక్షుడు వైశ్రీను, జనసేన నాయకులు ఆసూరి సుధాకర్, అల్లాటి రాజు, బీజేపీ నాయకురాలు నర్సిపల్లి హారిక, అడబాల రామకృష్ణారావు, చాపల చిన్నరాజు, యాళ్ళ ప్రదీప్, ఉప్పులూరి జానకిరామయ్య, బుడ్డిగ రాధా, పెనుగొండ రామకృష్ణ, మొకమాటి సత్యనారాయణ, మళ్ళ వెంకట్రాజు, కంటిపూడి శ్రీనివాస్, ఉర్లకల లోకేష్, దారా ఆదిశేషు, రఫిక్ రాజా, తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, నగర అధ్యక్షురాలు కోసూరి చండిప్రియ, ఆర్గనైజింగ్ సెక్రటరీ తురకల నిర్మల, ద్వారా పార్వతి సుందరీ, సింహా నాగమణి, కప్పల వెలుగుకుమారి, బీజేపీ నాయకులు రేలంగి శ్రీదేవి, వేలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.



నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెలుతున్న ఆదిరెడ్డి శ్రీనివాసు



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వాసు



సర్వమత ప్రార్థనలు చేస్తున్న దృశ్యం



చెబుతారు.. చేయరంతే!

సీఎంగా హామీలు ఇచ్చినా.. చేసింది సున్నా!

(కాకినాడ, ఆంధ్రజ్యోతి) మాట తప్పం.. మడమ తిప్పం.. ఇదీ ముఖ్యమంత్రి జగన్ తరచూ వల్లె వేసే సూక్తులు. కానీ ఆచరణలో అడుగడుగునా మాట తప్పడం.. మడమ తిప్పడం పరిపాటిగా మారింది. సీఎం హోదాలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పర్యటనలకు ఈ ఐదేళ్లలో అనేకసార్లు వచ్చి వెళ్లారు. వచ్చిన ప్రతిసారీ నియోజకవర్గాల్లో సమస్యలపై ఎక్కడికక్కడ అలవికాని హామీలు వదిలారు. నేను ఉన్నాను.. నేను విన్నాను అని గత ఎన్నికలప్పుడు డబ్బా కొట్టి గద్దెనెక్కిన ఆయన నేను చెప్పాను.. కానీ ఏదీ చేయను అన్న తరహాలో మారిపోయారు. జిల్లాకు వచ్చినప్పుడు ప్రజలకు కల్లబొల్లి కబుర్లు ఎన్నో చెప్పారు. వందలకోట్ల హామీల వరద పారించి నిధులు కూడా అక్కడికక్కడే విడుదల చేస్తున్నట్టు గొప్పలు చెప్పారు. తీరా ఐదేళ్లు గడిచినా అవేవీ ఆచరణకు నోచుకోలేదు. ఆ చివర రాజోలు నుంచి ఈ చివర రాజమహేంద్రవరం, కాకినాడ వరకు అనేక సభల్లో నోటికొచ్చిన హామీలు జారవిడిచారు. చేతిలో ప్రభుత్వం ఉన్నా అవేవీ ఆచరణలోకి తేలేదు. దీంతో సీఎం జగన్ ఇచ్చిన ప్రతి హామీ కల్లబొల్లి కబుర్లుగానే మారాయి. గోదావరికి వరదలు వచ్చినప్పుడు ఏటిగట్లు ఆధునికీకరిస్తామని చెప్పిన జగన్ తన పాలనలో దాని జోలికేవెళ్లలేదు. గోదావరి కాలువల్లో కాలుష్య నివారణకు మిషన్ క్లీన్ గోదావరి పేరిట హడావుడి చేసి దాన్ని గాలికి వదిలేశారు. పోలవరం పూర్తి చేసి కాలువలకు నీళ్లు విడుదల చేస్తామన్నారు. కానీ ఇప్పటికీ కాలువల పనే పూర్తికాలేదు. 2022 జూలైలో పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలులో కాపునేస్తం సభకు వచ్చిన సీఎం గొల్లప్రోలు, పిఠాపురం పట్టణాల అభివృద్ధికి రూ.40 కోట్లు ఇస్తున్నట్లు గొప్పగా ప్రకటించారు. కానీ ఒక్క రూపాయి విడుదలైతే ఒట్టు. ఏలేరు మొదటి విడత పనుల పూర్తికి రూ.142 కోట్లు, ఏలేరు, సుద్దగెడ్డ ఆధునికీకరణకు రూ.150 కోట్లు విడుదల చేసేసినట్టు చెప్పారు. గతేడాది పర్యటనలో కాండ్రకోట-తూర్పుపాలికల హైలెవెల్ బ్రిడ్జికి రూ.4కోట్లు ఇచ్చేసినట్లు కలరింగ్ ఇచ్చారు. కాండ్రకోట పరిధిలో ఏలేరు కాలువపై డ్రాప్ కం బెడ్ రెగ్యులేటర్ పునర్నిర్మాణానికి రూ.6 కోట్లు ప్రకటించారు.అయితే ప్రకటనలే.. కాగితాలపై పనులు మూలుగుతున్నాయి. సామర్లకోట జూనియర్ కాలేజీని డిగ్రీ కాలేజీగా మార్చడానికి రూ.18 కోట్లు ఇచ్చేస్తున్నట్టు సీఎం చప్పట్లు కొట్టించుకుని ప్రకటించారు. కానీ ఫైలే సిద్ధం కాలేదు. కాకినాడలో మంచినీటి సమస్య పరిష్కారానికి రూ.47కోట్లు ఇచ్చేసినట్లు చెప్పారు. కానీ నిధులకు అతీగతీ లేదు. ఇలా ఒకటేంటి నోటికి వచ్చిన హామీని సీఎం హోదాలో అలవోకగా వదిలేశారు. ఐదేళ్లయినా అవి కదలక హామీలకు చెదలు పట్టాయి.



హామీలే కాదండోయ్.. శిలాఫలకాలు ఇంతేగా..

- ఐదేళ్లలో హామీలన్నీ బూటకమే
- కల్లబొల్లి కబుర్లతో జగన్ కాలక్షేపం
- ఉమ్మడి జిల్లా పర్యటనకు వచ్చిన ప్రతిసారీ మోసం
- అదిగో నిధులంటూ ఆశచూపి మరచిన వైనం
- ఉమ్మడి జిల్లా పర్యటనలో ప్రశ్నిస్తున్న జనం



ముమ్మిడివరం మండలంలో గ్రోయిన్లు లేక కోతకు గురవుతున్న గోదావరి గట్టు

గోదారిలో... వరద హామీలు..

ముమ్మిడివరం/ఐ.పోలవరం, ఏప్రిల్ 18: జగన్ సీఎం అయ్యాక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గంలో సుమారు రూ.380.26 కోట్లతో చేసిన పలు శంకుస్థాపనలు, హామీలు నేటికీ కార్యరూపం దాల్చలేదు. మత్స్యకార దినోత్సవం సందర్భంగా 2022 మే 13న ఐ.పోలవరం మండలం మురమళ్ల బహిరంగ సభలో సీఎం జగన్ కాట్రేనికోన మండలం పల్లంకుర్రు-ఐ.పోలవరం మండలం జి.మూలపొలం మధ్య వృద్ధ గౌతమి నదీపాయపై రూ.76.90 కోట్లతో వారధి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఐ.పోలవరం మండలం గుత్తెనదీవి-భైరవలంక (గోగుల్లంక) గ్రామాల మధ్య వృద్ధ గౌతమి నదీపాయపై వారధి నిర్మాణానికి రూ.44.50 కోట్లతో శంకుస్థాపన చేశారు. ఐ.పోలవరం మండలం రామాలయం పేట వద్ద నదీకోత నివారణకు 1.200 కిలోమీటర్ల మేర రివిట్‌మెంట్, గ్రోయిన్ల నిర్మాణానికి రూ.79.76 కోట్లతో శంకుస్థాపన చేశారు. ఆ పనులను ఇటీవలే ప్రారంభించినా నత్తనడకన సాగుతున్నాయి. గతేడాది జూలై నెలలో వరదలు సంభవించగా ఆగస్టు 8న జగన్ ముమ్మిడివరం, అయినవిల్లి మండలాల్లోని లంక గ్రామాల్లో బాధితులను పరామర్శించారు. నదీకోత నివారణకు గురజాపులంక, లంకాఫ్ ఠాణేలంక, కూనాలంక, పళ్లవారిపాలెం వివేకానంద వారధి వద్ద, అయినవిల్లి మండలం కొండుకుదురులంక, పొట్టిలంకల్లో 3,700 మీటర్ల మేర రివిట్‌మెంట్, గ్రోయిన్ల నిర్మాణానికి రూ.150 కోట్లు నుంచి రూ.200 కోట్లు విడుదల చేస్తున్నట్టు ప్రకటించినా అవి ఇంతవరకూ విడుదల కాలేదు.



నాడు.. నేడు.. ఇంతేగా!

పి.గన్నవరం/మామిడికుదురు, ఏప్రిల్ 18: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం హైస్కూల్‌లో 2021 ఆగస్టు 16న జరిగిన నాడు-నేడు మొదటి దశ పనుల ప్రారంభోత్సవ బహిరంగ సభలో ఎమ్మెల్యే చిట్టిబాబు అభ్యర్థన మేరకు సీఎం జగన్ పలు హామీలు గుప్పించారు. అప్పనపల్లి ఎత్తిపోతల పథకం, అయినవిల్లి మండలంలో ఎదురుబిడిం కాజ్‌వే నిర్మాణం, మొండెపులంక ఈస్ట్ చానల్ ఆధునికీకరణ పనులకు హామీ ఇచ్చారు.అప్పనపల్లి ఎత్తిపోతల పథకానికి సుమారు రూ.40కోట్ల నుంచి రూ.45 కోట్లు వ్యయం అవుతుందని సంబంధిత అధికారులు అంచనాలు రూపొందించారు. ఐదు లంక గ్రామాల్లో 15 కిలోమీటర్ల మేర పంటకాల్వ ఏర్పాటు చేసి 4,035 ఎకరాల విస్తీర్ణంలోని కొబ్బరి తోటలకు ప్రయోజనం చేకూరేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కానీ అవి కాగితాలకే పరిమితమయ్యాయి. 2022 వరదల తర్వాత లంక గ్రామాల ప్రజలకు గంటి పెదపూడిలో వంతెన నిర్మిస్తామని, బూరుగులంక రక్షణకు గ్రోయిన్ల నిర్మాణం చేపడతామన్నారు. నేటికీ అయినవిల్లి మండలం అయినవిల్లిలంకలో తొగరపాయ ఎదురుబిడిం కాజ్‌వే ఆధునికీకరణ పనుల ఊసేలేదు. ఆర్‌అండ్‌బీ అధికారులు రూ.13 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా ఇప్పటి వరకు పరిపాలనాపరమైన ఆమోదం రాలేదు.2022లో వరదల అనంతరం బూరుగులంక వచ్చిన సీఎంకు మహిళలు తమ ప్రాంతం నదీకోతకు గురవుతోందని, గ్రోయిన్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. సంబంధిత అధికారులతో ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. మరుసటి రోజే హెడ్‌వర్క్స్ అధికారులు నదీకోతకు గురవుతున్న ప్రాంతాలను గుర్తించి సుమారు 450 మీటర్ల మేర గ్రోయిన్ల నిర్మాణానికి రూ.28 కోట్లు నిధులు అవసరమవుతాయని ప్రభుత్వానికి నివేదిక పంపించారు. కానీ నేటి వరకు వాటి ఊసేలేదు.



వరద వస్తే పడవ ప్రయాణమే దిక్కు.. ఎదురుబిడిం బ్రిడ్జి నిర్మాణమేదీ మరి..



పోలవరం ఎడమ కాలువ

పోలవరం..పరిహారమేదీ

గోకవరం, ఏప్రిల్ 18: జగన్ హామీ ఇస్తారు.. ఆనక మర్చి పోతారనుకుంటా.. ఆయనకు దేవుడిచ్చిన గొప్పవరం అది.. సీఎం జగన్ హామీ ఇచ్చారంటే.. అమలు చేయరంతే అన్నట్టుగా ఉంది పరిస్థితి. వైఎస్ఆర్ హయాంలో మంజూరుకా బడిన పోలవరం ఎడమ కాలువ తవ్వకానికి భూములు త్యాగం చేసిన సుమారు 70 నుంచి 80 మంది రైతులకు అప్పట్లో పూర్తి న్యాయం జరగలేదు. పోలవరం కాలువ తవ్వి సుమారు 20 సంవత్సరాలు కావొస్తుంది. 2005 భూసేకరణ చట్టం ప్రకారం బాధితులకు అన్యాయం జరిగింది. మీకు అప్పట్లో జరిగిన అన్యాయాన్ని నేను పూడుస్తాను. 2013 పార్లమెంట్‌లో భూసేకరణ చట్టంలో చేసిన మార్పులు చేర్పులు ప్రకారం మీ అందరికీ న్యాయం చేస్తాను. అప్పట్లో అందుకున్న నష్టపరిహారానికి చేర్చి ఎకరాకి మొత్తం రూ.5 లక్షలు గిట్టుబాటు అయ్యేలా నష్టపరిహారం చెల్లిస్తానంటూ సుమారు మూడేళ్ళ కిందట ఏజెన్సీ ప్రాంతమైన దేవీపట్నం మండలం ఇందుకూరు విచ్చేసిన సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చినహామీ నేటికీ నెరవేరలేదు. ఆ హామీ ఎప్పటికి అమలవుతుందంటూ రైతులు వెయ్యి కళ్ళతో ఆశగా ఎదురుచూస్తున్నారు.



పిఠాపురం పట్టణ వ్యూ

పట్టణాభివృద్ధి నిధులేవి సారూ!

పిఠాపురం/గొల్లప్రోలు,ఏప్రిల్ 18: మాట తప్పను... మడమ తిప్పను.. ఇది సీఎం జగన్ ప్రతిచోటా చెప్పే మాట. ఆచరణలో మాత్రం మాట చెబితే మడం తిప్పుడే. పట్టణాల అభివృద్ధికి ప్రత్యేక గ్రాంట్లు ఇస్తామన్న మాటలు ఫైళ్ల దాటలేదు. 21 నెలలు గడిచినా ఒక్క రూపాయి విడుదల కాలేదు. పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు పట్టణం లో జరిగిన కాపు నేస్తం సభలో పాల్గొనేందుకు సీఎం జగన్ 2022 జూలై 28న వచ్చారు.ఆ సభలో గొల్లప్రోలు పట్టణాభివృద్ధికి రూ.20 కోట్లు, పిఠాపురం పట్టణాభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. ఏయే పనులు చేపట్టాలో నిర్ణయించుకుని అంచనాలు తీసుకొస్తే తక్షణం నిధులు విడుదల చేస్తామన్నారు. ఇంజనీరింగ్ అధికారులు అంచ నాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపి 20 నెలలు గడిచినా నేటికీ ఒక్క రూపాయి విడుదల కాలేదు.

జగనన్న ఇళ్లు.. పేదలకు కన్నీళ్లు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)/సామర్లకోట, ఏప్రిల్ 18: వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఇళ్ల పథకం జగన్‌పై నమ్మకాన్ని వమ్ము చేసింది. కాకినాడ సిటీలోని 13,500 మందికి జగన్ ప్రభుత్వం స్థలాల కొరత సాకుతో యు.కొత్తపల్లి మండలం కొమరగిరిలో పట్టాలిచ్చింది. 2020 డిసెంబర్ 25న సీఎం జగన్ కొమరగిరి లేఅవుట్ ప్రారంభించారు. తాజాగా సముద్రం పోటుకు నీళ్లు ఏకంగా ఈలేఅవుట్ స్థలాలు, ఇళ్లకు సమీపంగా రావడంతో బెంబేలెత్తిపోతున్నారు .ఇక్కడ 365 ఎకరాలు ప్రైవేటు భూములను ఎకరం రూ.25 లక్షల చొప్పున సదరు కీలక నేత బినామీలతో భూములు కొనిపించారు. ఆ తర్వాత ప్రభుత్వానికి ఎకరాకు రూ.41 లక్షల చొప్పున అంట గట్టారు.రూ.145 కోట్లకుపైగా కొట్టేశారు. 13,500 మందికిపైగా కాకినాడ సిటీ నియోజకవర్గ లబ్ధిదారులకు పట్టాలు పంచి నాలుగేళ్లవుతున్నా ఇక్కడ పూర్తయిన ఇళ్లు కేవలం 180 మాత్రమే. 10 వేలకు పైగా వివిధ దశల్లో ఆగిపోయాయి. సామర్లకోట మండలంలో 7,537 గృహాలు మంజూరు కాగా వాటిలో 1,174 గృహాలు మాత్రమే పూర్తి చేశారు. గతేడాది జగన్ ఇక్కడకు వచ్చి సామూహిక గృహప్రవేశాలు చేపట్టినా అంతా పైపై బడాయే. రాష్ట్రస్థాయి గృహ నిర్మాణ సంస్థ చైర్మన్‌గా పదవి అధిరోహించిన దవులూరి దొరబాబు స్థానికుడైనా ఇక్కడే ఈ పథకం బోర్లాపడింది.



ఆర్వోకు నామినేషన్ పత్రం అందజేస్తున్న రాజమహేంద్రవరం కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్



ఆర్వోకు నామినేషన్ పత్రం అందజేస్తున్న గోపాలపురం కూటమి అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజు

తొలిరోజే నామినేషన్లకు క్యూ

- తూర్పుగోదావరి జిల్లాలో 6
- అంబేడ్కర్ కోనసీమలో 7
- కాకినాడలో 5 నామినేషన్లు దాఖలు

రాజమహేంద్రవరం/గోపాలపురం/అమలాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి)/కలెక్టరేట్(కాకినాడ) : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ గురువారం విడుదలైంది. గురువారం దశమి కావడంతో పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలయ్యాయి.తూర్పుగోదావరి జిల్లాలో తొలిరోజు ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. లోక్‌సభకు ఎవరూ వేయలేదు.రాజమహేంద్రవరం సిటీ నుంచి టీడీపీ అభ్యర్థిగా ఆదిరెడ్డి ఒక సెట్ నామినేషన్లు దాఖలు చేయగా ఆయన సతీమణి, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ స్వతంత్ర అభ్యర్థిగా మరో నామినేషన్ దాఖలు చేశారు. గోపాల పురం టీడీపీ అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు రెండుసెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. కొవ్వూరు నుంచి వైసీపీ అభ్యర్థిగా తలారి వెంకట్రావు ఒక సెట్, తలారి పరంజ్యోతి మరో సెట్ దాఖలు చేశారు. నిడదవోలునుంచి వైసీపీ అభ్యర్థిగా గెడ్డం శ్రీనివాసనాయుడు ఒక సెట్ నామినేషన్లు దాఖలు చేశారు.ఇక జిల్లాలోని అనపర్తి, రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్ నుంచి బోణీ కాలేదు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. అమలాపురం ఎస్సీ పార్లమెంటు నియోజకవర్గ స్థానానికి ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. మిగిలిన ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఏడుగురు అభ్యర్థులు పది సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలో తొలిరోజే ఐదు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. గుత్తుల జైశ్రీసూరేంద్రనాథ్‌బాబూజీ స్వతంత్ర అభ్యర్థిగా రెండు సెట్లు, పిల్లి సూర్యప్రకాష్ వైసీపీ తరుపున రెండు, పిల్లి సుభాష్‌చంద్ర బోస్ వైసీపీ తరుపున ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. అమలాపురం అసెంబ్లీ స్థానానికి చీకురుమెల్లి కిరణ్‌కుమార్ జనసేన పేరు రాసి ఒక సెట్, స్వతంత్ర్య అభ్యర్థిగా మరో సెట్ నామినేషన్లు దాఖలు చేశారు. మండపేట నియోజకవర్గం నుంచి కోన సూర్యప్రకాశరావు, మార్ని సత్యనారాయణ స్వతంత్ర అభ్యర్థులుగా రెండు సెట్లు, నందికోళ్ల రాజు నవతరం పార్టీ తరుపున ఒక సెట్ నామినేషన్లు దాఖలు చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ముమ్మిడివరం, రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గాలనుంచి ఇంకా అభ్యర్థులెవరూ నామినేషన్లు వేయలేదు.కాకినాడలో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జె.నివాస్ ఎన్నికల నోటిఫికేషన్‌ను గురువారం విడుదల చేశారు.కాకినాడ లోక్‌సభకు సంబంధించి జిల్లా కలెక్టర్ నివాస్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఆర్వో కార్యాలయంలో నామినేషన్ స్వీకరించారు. తొలిరోజు కాకినాడ లోక్‌సభకు ఒక్క నామినేషన్ దాఖలైంది. ఇండిపెండెంట్ అభ్యర్థిగా మెర్ల భవాని శంకర్ ప్రసాద్ రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాలు ఏడు ఉండగా రెండు నియోజకవర్గాల్లో నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి.దీనిలో కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఇండిపెండెంట్లుగా టేకుమూడి శ్రీనివాసరావు, వినుకొండ వెంకటేశ్వరరావు, మట్టా వెంకటేశ్వరరావు నామినేషన్లు వేశారు. ఒక్కొక్క సెట్ చొప్పున ఆర్వోకు నామినేషన్ అందజేశారు.కాకినాడ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గంనుంచి డాక్టర్ పితాని అన్నవరం ఇండిపెండెంట్‌గా ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. మిగిలిన ఐదు నియోజకవర్గాల్లో నామినేషన్ నిల్‌గా దర్శనమిచ్చింది.

ఓ విద్యార్థి ప్రాణం కాపాడిన రైల్వే ఉద్యోగి అప్రమత్తత

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పరీక్షల్లో ఫెయిలవడంతో ఆత్మహత్య చేసుకుంటానంటూ ఇంటి నుంచి బయటకు వచ్చిన ఓ విద్యార్థిని రైల్వే ఉద్యోగి అప్రమత్తత కాపాడింది.కాకినాడకు చెందిన ఉస్మాన్ కుమారుడు(17) ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత సాధించకపోవడంతో ప్రాణాలు తీసుకుంటానని చెప్పి 17న ఇంటి నుంచి బయటకు వచ్చేశాడు. ఇంట్లో వాళ్లు కాకినాడ రైల్వేస్టేషన్‌లో ఫొటో చూపించి వాకబు చేస్తున్న క్రమంలో కాకినాడ నుంచి బెంగళూరు వెళ్లే రైలెక్కడం చూశామని స్టేషన్‌లోని కూలీలు చెప్పారు. వెంటనే రాజమండ్రిలో ఉన్న తన అన్నయ్యకు ఉస్మాన్ ఫోన్ చేసి చెప్పారు. వాళ్లు రాజమండ్రి రైల్వే స్టేషనుకు వెళ్లి చీఫ్ టికెటింగ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళికి విషయం చెప్పడంతో అప్రమత్తమయ్యారు. టీసీలు వై.నరేశ్, పి.ప్రశాంత్, జీవీఎస్ భవానీతో విషయం చెప్పి రైలులో వెతకడం ప్రారంభించారు. ఎస్-11 బోగీ బాత్రూం వద్ద కూర్చుని ఉన్న ఆ బాలుడిని చంద్రమౌళి గుర్తించారు. జీఆర్పీ పోలీసుల సహాయంతో కిందికి దింపి కౌన్సెలింగ్ చేశారు. బాలుడి తండ్రి సూచనలతో రాజమండ్రిలోని వారి బంధువులకు అప్పగించారు. ఈ మేరకు సీటీఐ చంద్రమౌళి, టీసీలను డీఆర్ఎం నరేంద్ర ఏ.పాటిల్,కమర్షియల్ మేనేజర్ రాంబాబు ప్రశంసించారు.

సీఎం జగన్ మౌనయాత్ర!

- బస్ దిగలేదు.. ఓటు అడగలేదు
- బస్ లోపల నుంచే అభివాదం
- అక్కడక్కడా మాత్రమే బయటకు
- రెండు జిల్లాల పర్యటనలోనూ ఇంతే
- జగన్ రోడ్ షో.. వైసీపీ నేతల నిరాశ
- ఎస్టీ రాజాపురంలో రాత్రి బస
- ఉదయం నుంచి హైవేపై ట్రాఫిక్ ఇక్కట్లు



సీఎం కాన్వాయ్ వస్తున్న వేళ ఖాళీగా జొన్నాడ సెంటర్

రావులపాలెం/ఆలమూరు/రాజమహేంద్రవరం/సిటీ/రూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ యాత్రకు స్పందన అంతంతమాత్రంగానే ఉంది. వైసీపీ నాయకులు నానాతంటాలూ పడి ఆటోల్లో తరలించిన జనాలకు ఆపద్ధర్మ ముఖ్యమంత్రి జగన్ అభివాదంతో సరిపెట్టారు. జిల్లాలోని బస్సు యాత్రలో ఎక్కడా కూడా బస్సు నుంచి జగన్ కిందికి దిగి మాట్లాడలేదు. అక్కడక్కడా అభివాదం చేసుకుంటూ ముందుకు వెళ్లిపోయారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో గురువారం పర్యటన ముగించుకుని బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, తూర్పుగోదావరి జిల్లాలో జాతీయ రహదారి మీదుగా రోడ్ షో నిర్వహించారు. సీఎం జగన్ బస్సు యాత్ర రావులపాలెం, ఆలమూరు మీదుగా మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో కడియం మండలం పొట్టిలంక చేరుకున్నారు. అక్కడ బస్సు లోపల నుంచే అభివాదం చేసుకుంటూ కడియపులంకలో ఏర్పాటు చేసిన బసకు చేరుకున్నారు. 4 గంటల సమయలో కడియపులంక పూలమార్కెట్ సెంటర్‌లో అభివాదం చేస్తూ బుర్రిలంక, వెంకయ్యపేట గ్రామాల మీదుగా వేమగిరి చేరుకున్నారు.బొమ్మూరు, హకుంపేట మీదుగా సాయంత్రం 5:30 గంటలకు రాజమహేంద్రవరం మోరంపూడి సెంటర్‌కు చేరుకున్నారు. మోరంపూడి వద్ద సెంటర్‌లో బస్‌పైకి ఎక్కి ప్రజలకు అభివాదం చేశారు. లారీ స్టాండ్ సెంటర్, వీఎల్ పురం, పాతసోమాలమ్మ ఆలయం సెంటర్, ఆర్‌టీసీ కాంప్లెక్స్, తాడితోట, బైపాస్ రోడ్డు మీదుగా స్వామి థియేటర్ సెంటర్, అజాద్ చౌక్, అల్లూరి సెంటర్, దేవీచౌక్, గోకవరం బస్టాండ్ సెంటర్ మీదుగా అంబేడ్కర్ సెంటర్ నుంచి ఆర్యాపురం మీదుగా మూలగొయ్యి, సీతంపేట మీదుగా పేపరుమిల్లు సెంటర్‌కు చేరుకున్నారు. ప్రజలు ఎక్కువ ఉన్నచోట బస్సుపైకి ఎక్కి అభివాదం మాత్రమే చేశారు. అటుపై మల్లయ్యపేట, కాతేరు మీదుగా గామన్ రోడ్డు దివాన్‌చెరువు వైపు వెళ్లారు. పర్యటన ముగించుకుని గురువారం రాత్రి రంగంపేట మండలం ఎస్టీ రాజాపురంలో ఏడీబీ రోడ్డు ప్రక్కన గల ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన బసకు చేరుకున్నారు. కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల నడుమ జగన్ పర్యటన సాగింది. ఆలమూరు మండలం మడికిలో పల్లవి, ప్రత్యూష అనే బాలికలు అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో అయన బస్సు దిగి వారితో మాట్లాడి న్యాయం చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ జగదీశ్ కాన్వాయ్ వెంటే ఉన్నారు. జగన్ కూడళ్లలో ఆగినప్పుడు మొబైల్ కమాండ్ కంట్రోల్ వాహనానికి అనుసంధానమై ఉండే డ్రోన్‌ను ఎగురవేసి పరిస్థితులను సీఎం భద్రతా సిబ్బంది గమనించారు. బస్సుపై ముగ్గురు భద్రతా సిబ్బంది బైనాక్యులర్స్‌తో నిరంతరాయంగా పరిశీలించారు. జగన్ వద్ద ఒకరిద్దరు మినహా ఎక్కువ సంఖ్యలో వైసీపీ నాయకులు లేకుండా జాగ్రత్త తీసుకున్నారు. జగన్ బస్సు యాత్రలో ఎక్కడా పూలదండలు కనిపించకపోవడం గమనార్హం.



కట్టుదిట్టమైన భద్రత మధ్య అక్కడక్కడా పైకి వచ్చి ఇలా..

పేపరు మిల్లు కార్మికులకు హామీ ఏదీ..

గత 16 రోజులుగా సమ్మెలో ఉన్న ఆంధ్రప్రదేశ్ పేపరు మిల్లు కార్మికులు జగన్‌కు వినతిపత్రం ఇచ్చి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. జగన్ బస్సుయాత్ర పేపర్ మిల్లు వద్దకు చేరుకోగానే ఉయ్ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలు చేశారు. దీంతో అక్కడ గందరగోళ పరిస్థితి నెలకొంది. జగన్ తన బస్సులోకి ముగ్గురు కార్మిక నాయకులను పిలిచి వారి వద్ద నుంచి వినతిపత్రం స్వీకరించారు. అయితే కార్మికులకు స్పష్టమైన హామీ ఇవ్వకుండానే అక్కడ బస్సు పైకి ఎక్కి అభివాదం చేసి ముందుకు సాగారు.దీనిపై పేపరు మిల్లు కార్మికులు అసహనం వ్యక్తం చేశారు.

అయ్యో రామ.. పూజ ఆపేశారా?

సీతంపేటలో శతాబ్దం పైబడి చరిత్ర కలిగిన రామాలయం ఉంది. ఇక్కడ 17న శ్రీరామనవమి ఉత్సవాలు చేశారు. రోడ్డుకు ఓ వైపు ట్రాఫిక్‌కి ఇబ్బంది లేకుండా టెంటు వేసి కల్యాణం చేస్తారు. నాలుగు రోజుల పాటు టెంటును అలాగే ఉంచుతారు. అయితే జగన్ రాక సందర్భంగా ఆ టెంటును తీసివేయించడంతో పాటు గురువారం సాయంత్రం జరగాల్సిన పూజలు జగన్ వెళ్లే వరకూ నిలిపివేయించారు.



అంబేడ్కర్‌ను మరిచారా జగన్

రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఏ రాజకీయ వచ్చినా ఖశ్చితంగా దిగి విగ్రహానికి నివాళులర్పించి వెళతారు. ఇది ఎప్పటి నుంచో వస్తున్న సంప్రదాయం. జగన్ పర్యటనలో ఆ సెంటర్ నుంచి వెళ్లారు కానీ అక్కడ ఆగి నివాళులర్పించలేదు. దీనిపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బైక్‌కు పెట్రోల్..మహిళలకు రూ.300?

జగన్ పర్యటన సందర్భంగా జాతీయ రహదారిపై ఆంక్షలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సు యాత్ర డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం గోపాలపురం వద్ద ప్రవేశించాక సర్వీసు రోడ్ల నుంచి ప్రజలెవరూ జాతీయ రహదారిపైకి రాకుండా పోలీసులు ఆంక్షలు విధించడంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. ఆర్టీసీ బస్సులు పూర్తిస్థాయిలో రాక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈతకోటలోని ఓ ఫార్మసీ కళాశాల యజమాన్యం జగన్ కోసం విద్యార్థులను మండుటెండలో నుంచో పెట్టారు.బస్సు యాత్ర రావులపాలెం రాక ముందే పలువురు మహిళలు వెనుదిరిగి వెళ్లిపో వడం కనిపించింది. జొన్నాడ నుంచి మడికి వరకు సాగిన యాత్రలో జనం లేకపోవడంతో ఆయన బస్సు లోపలే ఉండిపోయారు. ఇక జగన్ పర్యటన అంతటా పెద్దగా జనస్పందనలేదు. బైక్‌లకు ఉచిత పెట్రోల్,మందు, మహిళలకు రూ.300 ఇవ్వడంతో పాటు భోజనాలు ఏర్పాటు చేసినట్టు సమాచారం.



రావులపాలెంలో జగన్ పర్యటనకు ఎండలో విద్యార్థినులు

మౌలిక వసతులు కల్పన టీడీపీతోనే సాధ్యం

టీడీపీ-జనసేన-బీజేపీ కొవ్వూరు అభ్యర్థి ముప్పిడి


మార్కొండపాడులో కరపత్రాలు అందజేస్తున్న కూటమి అభ్యర్థి ముప్పిడి

చాగల్లు, ఏప్రిల్ 18: గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతులు కల్పన టీడీపీతోనే సాధ్యమని టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండంలోని మార్కొండపాడులో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రైతులు, వ్యవసాయ కూలీలు, వృద్ధులు తదితరులను కలిసి ఓటు అభ్యర్థించారు. వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీలు నిర్వీర్యం అయిపోయాయని విమర్శించారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ మాజీ ఆళ్ల హరిబాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో భవన నిర్మాణం రంగం కుదేలయ్యిందని, నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిపోయి కార్మికులకు పనులు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, కరుటూరి సతీష్, కేతా సాహెబ్, దొంగ రామకృష్ణ, జొన్నకూటి వెంకాయమ్మ, సుంకవల్లి రమేష్, పోసికు మారి, జనసేన నాయకులు ఉప్పులూరి చిరంజీవి పాల్గొన్నారు.

నేడు నామినేషన్.. టీడీపీ-జనసేన-బీజేపీ కొవ్వూరు నియోజకవర్గ అభ్యర్థిగా ముప్పిడి వెంకటేశ్వరరావు శుక్రవారం ఉదయం 9గంటలకు కొవ్వూరులో నామినేషన్ వేయనున్నట్టు ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి తెలిపారు.

ఇంకా 24 రోజులు మాత్రమే..

కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు


నామినేషన్ వేసేందుకు వెళ్తున్న కూటమి అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు

గోపాలపురం, ఏప్రిల్ 18: రాష్ట్రంలో తన నిరంకుశత్వంతో అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేసి రాష్ట్ర సంపదను కొల్లగొట్టిన జగనాసురున్ని గద్దె దింపేందుకు ఇంకా 24 రోజుల సమయం మాత్రమే ఉందని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. కూటమి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆయన గురువారం మధ్యాహ్నం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక జగన్ పని అయిపోయిందని పులివెందుల్లో కూడా జగన్ గెలిచే పరిస్థితిల్లో లేడని జోష్యం చెప్పారు. కోడికత్తి డ్రామా మొదలుకుని తండ్రి, చిన్నాన్న శవాలతో గద్దెనెక్కి ప్రజలను పీడించుకుతిన్నది చాలక మరోసారి సిద్ధం అంటూ సానుభూతి కోసం రాళ్లతో కొట్టించుకుని ప్రతిపక్షాలపై బురద చల్లడం జగన్‌కి కొత్తేమీ కాదన్నారు. రాష్ట్ర ప్రజలు ఎన్నికలు ఎప్పుడు వస్తాయని ఆతృతగా ఎదురు చూస్తున్నారని జగన్ సంక్షేమం మాటున మోసం అనే బటన్ నొక్కితే ప్రజలు మే 13న బుద్ధి చెబుతామనే బటన్ నొక్కేందుకు సంసిద్ధమయ్యారని అన్నారు. రాష్ట్రంలో టీడీపీ పార్టీకి పెరుగుతున్న ఆదరణ చూసి జగన్ వెన్నులో ఓటమి వణుకు మొదలైందన్నారు. రాష్ట్ర ప్రజల రక్తాన్ని జలగలా పీల్చుకున్న జగన్‌కి ఇవే చివరి ఎన్నికలని మద్దిపాటి అన్నారు.

సీఎం జగన్.. రావులపాలెం వయా పెరవలి

పెరవలి, ఏప్రిల్ 18: సీఎం జగన్ తణుకు నుంచి పెరవలి మీదుగా రావులపాలెం వెళ్లారు. గురువారం మధ్యాహ్న సమయంలో ఆయన పర్యటన ఉండడంతో జాతీయ రహదారిపై ఆయన అభిమానుల కంటే పోలీసులు ఎక్కువగా కనిపించారు. పెరవలి, ఖండవల్లి, అన్నవరప్పాడు మీదుగా వెళుతూ ఆయన బస్సులో నుంచి అభివాదం చేసుకుంటూ వెళ్లారు. సుమారు 100 మంది మాత్రమే అభిమానులు కనిపించారు. ఖండవల్లి, అన్నవరప్పాడు సెంటర్‌లో కూడా అంతంతమాత్రంగానే కార్యకర్తలున్నారు. నిడదవోలు వైసీపీ అభ్యర్థి శ్రీనివాసనాయుడు నామినేషన్ ఉన్నందు వల్లే ఇక్కడకు కార్యకర్తలు పెద్దగా రాలేదని స్థానిక వైసీపీ నాయకులు పేర్కొన్నారు.

మల్లేశ్వరస్వామిని దర్శించుకున్న 'ఆరిమిల్లి'


మల్లేశ్వరంలో కపిల మల్లేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఆరిమిల్లి

పెరవలి, ఏప్రిల్ 18: మండలంలోని మల్లేశ్వరం కపిల మల్లేశ్వరస్వామిని తణుకు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అదే గ్రామంలోని రామకృష్ణ మఠంలో శారదా పీఠాన్ని దర్శించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మేడిచర్ల బుజ్జి, పాములపర్తి కృష్ణమూర్తి, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

సంక్షేమం పేరుతో రాష్ట్రం నిలువు దోపిడీ

సీపీఐ జిల్లా కార్యదర్శి మధు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్, సీపీఐ నాయకులు

కొవ్వూరు, ఏప్రిల్ 18: సంక్షేమం పేరుతో సైకో జగన్ రాష్ట్రాన్ని నిలువునా దోచుకున్నాడని సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి జిల్లా తాటిపాక మధు విమర్శించారు. గురువారం కొవ్వూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మధు మాట్లాడుతూ ఇండియా కూటమి బలపర్చిన అరుణకుమారిని గెలిపించాలన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కాకుండా ఉండాలన్నా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై దాడులు ఆగాలన్నా కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కొవ్వూరును మోడల్ నియోజకవర్గంగా తీర్చి దిద్దుతామన్నారు. సమావేశంలో సీపీఐ జిలా సహాయ కార్యదర్శి కొండ్రుపు రాంబాబు, వి.కొండలరావు, కొప్పిశెట్టి శ్రీనివాస్, చింతలపూడి సుధీర్, కె.నాగేంద్ర పాల్గొన్నారు.

నేడు పురందేశ్వరి నామినేషన్ దాఖలు

పవన్‌కల్యాణ్, బీజేపీ పెద్దల హాజరు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 18 : బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఆ పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి శుక్రవారం నామినేషన్ దాఖలు చేస్తారని బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి లంకా దినకర్ వెల్లడించారు. రాజమహేంద్రవరం బీజేపీ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్ర వరం జేఎన్ రోడ్డులోని తన నివాసం నుంచి శుక్రవారం మధ్యాహ్నం 1.10 గంటలకు పురందేశ్వరి ర్యాలీగా బయలుదేరి మధ్యాహ్నం 2.20 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తారన్నారు. నామినేషన్ ర్యాలీలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ పాల్గొనే అవకాశం ఉందన్నారు. అంతే కాకుండా ఢిల్లీ నుంచి కేంద్ర పార్టీ పెద్దలు, ఏపీ ఎన్నికల కో ఇన్‌చార్జి సిద్ధార్థ్‌నాథ్ సింగ్, టీడీపీ రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు.

ఫ్లయింగ్ స్క్వాడ్‌లు నిఘా పెట్టాలి

» సమీక్ష సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారిణి మాధవీలత


ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు క్షేత్ర స్థాయిలో మద్యం లావాదేవీలు, ఇతర ఉచిత పంపిణీల తీరుపై సూక్ష్మ స్థాయిలో నిఘా పెట్టాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.మాధవీలత ఆదేశించారు. జిల్లా ఎఫ్ఎస్‌టీ బృందంతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించిన ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని 7 నియోజక వర్గాల స్థాయిలో 63 బృందాలు మూడు షిఫ్టుల్లో విధులు నిర్వర్తిస్తున్నాయ న్నారు. వీటికి అదనంగా ఎన్నికల కమిషన్ ఆదేశాలతో జిల్లా స్థాయిలో 10మంది సభ్యులతో జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాన్ని ఏర్పాటు చేశామ న్నారు. ఈ బృందానికి సహాయ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డిని నోడల్ అధికారిగా నియమించామన్నారు. ఇప్పటికే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినందున ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు మరింత అప్రమత్తత, కచ్చితత్వంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. గత ఏడాది ఇదే రోజున ఎంత మద్యం లావాదేవీలు జరిగాయి, వివిధ ఫ్రీబీస్, వస్తువుల వినిమయం ఎంత ఉందో షాపుల వారీగా, ప్రాంతాల వారీగా గణాంకాలను తనిఖీ చేయాలన్నారు. ఇన్‌కం ట్యాక్స్, జీఎస్టీ, ఎస్ఎస్‌టీ శాఖల ఆధ్వర్యంలో రికార్డులను పరిశీలించి తదుపరి చేపట్టాల్సిన చర్యలపై నివేదిక అందజేయాలని మాధవీలత ఆదేశించారు. ఎఫ్ఎస్‌టీ బృందాలు తనిఖీల వివరాలను ఎప్పటికప్పుడు రిపోర్టు చేయడం అత్యంత అవసరమన్నారు. జిల్లాలోని ఐదు డిస్టిలరీలు, ఒక బ్రూవరీ ద్వారా నిర్వహిస్తున్న కార్యకలాపాలపై సమగ్ర సమాచారం సేకరించాలన్నారు. అమ్మకాలను నియంత్రించే క్రమంలో సీలింగ్ పద్ధతిని అనుసరిస్తున్నామని ఆమె తెలిపారు. సమావేశంలో సహాయ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎం.భానుప్రకాశ్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌వో కార్యాలయాల్లో హెల్ప్‌డెస్కులు : సబ్ కలెక్టర్

కొవ్వూరు, ఏప్రిల్ 18: ఎన్నికల కమిషన్ ఆదేశాలమేరకు సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసినట్టు కొవ్వూరు సబ్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. శుక్రవారం పాత్రికేయులతో మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ నిమిత్తం నియమించబడిన పోలింగ్ సిబ్బంది ఓపీవోలు(అందరు పోలింగ్ ఆఫీసర్స్), మైక్రో అబ్జర్వర్స్, ఎసెన్షియల్ సర్వీసెస్, మే 13వ తేదీన ఎన్నికల పోలింగ్ విధులు నిర్వహించే ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్, డ్రైవర్స్, క్లీనర్స్ ఇతర సిబ్బంది నుంచి ఫారం-12 స్వీకరిస్తున్నట్టు చెప్పారు. అందుకోసం కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయం, 4 అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలు (కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి మండల తహశీల్దార్ కార్యాలయాలు, కొవ్వూరు మున్సిపల్ కార్యాలయంలో) హెల్ప్‌డెస్కులు ఈ నెల 15వ తేదీ నుంచి ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని కొవ్వూరు నియోజకవర్గంలో ఓటు హక్కు కలిగి ఉండి, 2024 సార్వత్రిక ఎన్నికల్లో విధులు కేటాయించిన ఎన్నికల సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని సబ్ కలెక్టర్ చెప్పారు.

ఒక డీటీ, ఐదుగురు టీచర్లు సస్పెన్షన్

73 మందికి షోకాజ్ నోటీసులు : కలెక్టర్

రాజమహేంద్రవరం, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): ప్రిసైడింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్ శిక్షణ తరగతులకు గైర్హాజరైన ఒక డిప్యూటీ తహశీల్దార్, ఐదుగురు స్కూల్ అసిస్టెంట్లను సస్పెండ్ చేయడంతో పాటు 73 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. కొవ్వూరుకు చెందిన డిప్యూటీ తహశీల్దార్ ఎస్.బంగార్రాజు, రాజమహేంద్రవరం పరిధిలోని రఘుదేవపురం జడ్పీ హైస్కూల్ అసిస్టెంట్ జి.శేఖర్, గోపాలపురం పరిధిలోని పల్లంట్ల స్కూల్ అసిస్టెంట్ ఈ.మాధవరావు, రాజానగరం పరిధిలోని పురుషోత్తపట్నం స్కూల్ అసిస్టెంట్ జి.సంతోషి మాతా, రాజమండ్రి రూరల్ పరిధిలోని వేమగిరి స్కూల్ అసిస్టెంట్ ఎన్.శ్రీనివాసరావు, అనంతపల్లి స్కూల్ అసిస్టెంట్ కె.మహంకాళీరాజులను సస్పెండ్ చేసినట్టు తెలిపారు.

మే 11న జాతీయ లోక్ అదాలత్

కొవ్వూరు, ఏప్రిల్ 18: కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో మే 11వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్, చెక్‌బౌన్స్, బ్యాంకు బకాయి, మనోవర్తి, గృహహింస, వాహన ప్రమాద, బీమా కేసులు రాజీమార్గంలో పరిష్కరించుకోవచ్చునన్నారు. అలాగే ప్రీ లిటిగేషన్, ఫైనాన్స్ కేసులు, బీఎస్ఎన్ఎల్, టెలిఫోన్ బకాయి కేసులు రాజీ చేసుకోవచ్చునన్నారు. కేసులు రాజీ చేసుకోవడం వల్ల కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు.

అరాచక పాలన పోవాలి.. అభివృద్ధి గెలవాలి

» టీడీపీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్చిబాబు


చాగల్లు కార్యక్రమంలో మాట్లాడుతున్న అచ్చిబాబు

చాగల్లు, ఏప్రిల్ 18 రాష్ట్రంలో ప్రస్తుతమున్న అరాచక పాలన పోవాలని, మన పిల్లల భవిష్యత్, రాష్ట్ర అభివృద్ధి కోసం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిని గెలిపించుకోవాలని టీడీపీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు) అన్నారు. గురువారం చాగల్లులో జరిగిన కార్యక్రమంలో కమ్మ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కొఠారు అశోక్‌బాబా, వైసీపీ నాయకులు లకంసాని శ్రీనివాసరావు, కొఠారు శ్రీనివాసరావు, కట్టా స్వామి గౌడ్, కొఠారు శివరామకృష్ణ సహా మండలంలోని సుమారు 50 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వీరిని అచ్చిబాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ అమ్మకాలు పెరిగిపోయాయని, మన పిల్లల భవిష్యత్ నాశనం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే మన భవిష్యత్, రాష్ట్ర ప్రగతి బాగుంటుందన్నారు. కూటమి నియోజకవర్గ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని, వాటిని మరింత రెట్టింపు చేసి కొనసాగిస్తామని, పథకాలు తీసేస్తారనే తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కొఠారు అశోక్‌బాబా మాట్లాడుతూ రాష్ట్రానికి రాజధాని కావాలని, పోలవరం ప్రాజెక్టు పూర్తి కావాలని, అందుకోసం చంద్రబాబు గెలవాలని టీడీపీలో చేరినట్టు చెప్పారు. పదవులు ముఖ్యం కాదని సామాన్య కార్యకర్తగా కొనసాగుతానని ప్రజలకు అభివృద్ధి సంక్షేమం కావాలన్నారు. కార్యక్రమంలో కొవ్వూరు అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు మద్దిపట్ల శివరామకృష్ణ, టీడీపీ నాయకులు ఆళ్ల హరిబాబు, నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, కరుటూరి సతీష్, మద్దిపాటి వీరరాఘవులు, కేతా సాహెబ్, దొంగ రామకృష్ణ, జనసేన నాయకులు పీకే రంగారావు, ఉప్పుటూరి చిరంజీవి, కొప్పాక విజయకుమార్, బీజేపీ నాయకుడు గ్రంధి రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల వర్తక సంఘం ఆధ్వర్యంలో అచ్చిబాబు సహా వేదికపైన ఉన్న ప్రముఖులను సన్మానించారు. వర్తక సంఘం నాయకులు ఎం వెంకన్న, పచ్చిపులుసు ప్రసాద్, ఆంబటి అబ్బులు, సుబాష్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి

కొవ్వూరు, ఏప్రిల్ 18: రాష్ట్ర భవిష్యత్ కోసం సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్చిబాబు అన్నారు. కొవ్వూరు మండలం కాపవరంలో టీడీపీ-జనసేన-బీజేపీ ఆత్మీయ సమావేశం గురువారం నిర్వహించారు. అచ్చిబాబు మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో వెనుకబడిందన్నారు. భావితరాల భవిష్యత్, రాష్ట్రం అభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇంచార్జి టి.వి.రామారావు, జెట్టి బంగారయ్య, ఉప్పులూరి రాజేంద్ర మునిప్రసాద్, ఎరుబండి సురేష్, కె.రాజు, పెండ్యాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు అభినందనీయం : బూరుగుపల్లి

నిడదవోలు, ఏప్రిల్ 18: వైసీపీ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆ పార్టీకి చెందిన మైనార్టీలు తెలుగుదేశం పార్టీలోకి రావడం అభినందనీయమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరుగుపల్లి శేషారావు అన్నారు. గురువారం నిడదవోలులోని పార్టీ కార్యాలయంలో పట్టణ, మండలానికి చెందిన వైసీపీ మైనార్టీ నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా మైనార్టీలు అంటూనే ఆ పార్టీలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు తీరని ద్రోహం చేసారని అన్నారు. మనుషుల మధ్య కులాలు మతాలను సృష్టించి అగాధాలు సృష్టించిన వ్యక్తి జగన్ అని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా షేక్ నూర్ అహ్మద్ పాషా, షేక్ రుక్మీద్దీన్ పాషా, సాదిక్ హుస్సేన్ వలి, అహ్మద్ రఫీ తదితర్లు తెలుగుదేశం పార్టీలో తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కొమ్మిన వెంకటేశ్వరరావు, కారింకి నాగేశ్వరరావు, షాజహాన్, ఎం.డి.అక్రమ్ తదితర్లు పాల్గొన్నారు.

అన్నదేవరపేటలో ఇంటింటా ప్రచారం

తాళ్లపూడి, ఏప్రిల్ 18: మండలంలోని అన్నదేవరపేటలోని అరుంధతీపేటలో టీడీపీ సీనియర్ నాయకుడు అల్లూరి విక్రమాదిత్య ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి ముప్పిడి వెంకటేశ్వరరావుని, కమలం గుర్తుపై ఓటు వేసి దగ్గుబాటి పురందేశ్వరిని గెలిపించాలని కోరారు కార్యక్రమంలో కాకర్ల సత్యేంద్ర, కొఠారు జగపతి, కూచిపూడి హనుమంతరావు, కూచిపూడి లచ్చిబాబు, ముళ్ళపూడి రామచంద్రం, దుగ్గిరాల సూర్యప్రకాష్, ఇంజరపు అబ్బులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం

పెరవలి, ఏప్రిల్ 18: కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్, ఎంపీ అభ్యర్థి పురందేశ్వరిలకు మద్దతుగా మండలంలోని పలు గ్రామాల్లో టీబడడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి పార్టీకి సంబంధించిన కరపత్రాలు పంచు తూ దుర్గేష్‌కు గాజు గ్లాస్‌పైన, పురందేశ్వరికి కమలం గుర్తుపైన ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. మండలంలోని కానూరు, ఉసులుమర్రు, తీపర్రు, కాకరపర్రు, పెరవలి, ముక్కామల, ఖండవల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.


నిడదవోలులో టీడీపీలో చేరిన మైనార్టీ నాయకులతో శేషారావు

వినాయక ఆలయంలో మద్దిపాటి పూజలు

నామినేషన్ ర్యాలీకి అపూర్వ ఆదరణ


నల్లజర్లలో వినాయకాలయంలో స్వామిని దర్శించుకుంటున్న మద్దిపాటి

నల్లజర్ల, ఏప్రిల్ 18: కూటమి నియోజకవర్గ అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు నామినేషన్ ర్యాలీకి అపూర్వ ఆదరణ లభించింది. గురువారం ద్వారకాతిరుమల నుంచి గోపాలపురం వరకు ర్యాలీగా వెళ్లిన ఆయన కోసం జనం పోటెత్తారు. నల్లజర్లలో జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు ప్రచారం రథం ఎక్కారు. స్థానిక వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. మహిళలు మద్దిపాటికి, ముళ్ళపూడికి హారతులిచ్చి ఆశీర్వాదించారు. వి గ్రాండ్ హోటల్ సమీపంలో 1500మంది కార్యకర్తలకు అల్పాహారం ఏర్పాటు చేశారు. 500 కార్లు, వెయ్యి బైక్‌లు, 300 ఆటోల్లో కార్యకర్తలు స్వచ్ఛందంగా మద్దిపాటి వెంట వెళ్లారు.

దేవరపల్లి: నామినేషన్ వేయడానికి వెళ్తున్న మద్దిపాటి వెంకట్రాజుకు మద్దతుగా భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు దేవరపల్లిలో డైమండ్ జంక్షన్ వద్దకు చేరుకుని అక్కడ నుంచి ప్రచార రథంపై మద్దిపాటితో పాటు ముళ్లపూడి బాపిరాజు, టీడీపీ నాయకురాలు మాగంటి రూప, జనసేన ఇన్‌ఛార్జ్ సువర్ణరాజు అభివాదం చేసుకుంటూ నల్లజర్ల నుంచి యర్నగూడెం, దేవరపల్లి, గోపాలపురం మీదుగా భారీ ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఆండ్రూ అనీల్, గోపాలపురం అధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ, నాయకులు గన్నమని హరికృష్ణ, యాగంటి వెంకటేశ్వరరావు, పెనుమత్స సుబ్బరాజు, రాంబాబు, గద్దే విజయ్, గడా మురళీ, అజిత్‌కుమార్, చిలకా రాజేష్, కరుటూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి

- వివాహేతర సంబంధమే కారణం
- యర్నగూడెంలో ఘటన..నిందితులు అరెస్టు


దాడిలో గాయపడ్డ శీలా బుచ్చయ్య

దేవరపల్లి, ఏప్రిల్ 18: వివాహేతర సంబంధానికి తన మాజీ ప్రియుడు అడ్డువస్తున్నాడని ఓ మహిళ తన ప్రస్తుత ప్రియుడుతో కలిసి అతనిపై కత్తితో దాడి జరిపినట్టు పోలీసులు తెలిపారు. దేవరపల్లి మండలం యర్నగూడెం గ్రామానికి చెందిన శీలా బుచ్చయ్యకు స్థానికంగా ఉండే మహిళతో వివాహేతర సంబంధం ఉంది. ఆమె అదే గ్రామానికి చెందిన ముంగర దుర్గారావుతోనూ సన్నిహితంగా ఉంటోంది. ఈ సంబంధం గురించి బుచ్చయ్యకు తెలియడంతో ఆమెతో గొడవలు జరిగేవి. మాజీ ప్రియుడ్ని అంతమొందించాలని ప్రస్తుత ప్రియుడితో కలిసి ఆమె పథకం వేసింది. బుధవారం అర్ధరాత్రి బుచ్చయ్యకు ఫోన్ చేసి యర్నగూడెం శివారు పోలవరం కాల్వ వంతెన వద్దకు రమ్మని చెప్పింది. బుచ్చయ్య అక్కడికి రాగా దుర్గారావు కత్తితో తల, కుడికాలుపై కత్తితో దాడి చేశాడు. అనంతరం వారిద్దరూ ద్విచక్రవాహనంపై పరారయ్యారు. క్షతగాత్రుడిని 108 వాహనంలో గోపాలపురం పీహెచ్‌సీకి తరలించి, మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడి అల్లుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు. నిందితులు ముంగర దుర్గారావుతో పాటు మహిళను కూడా యర్నగూడెం ఆర్ఆర్.కన్వెన్షన్ కల్యాణ మండపం సమీపంలో గురువారం ఉదయం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్టు ఎస్ఐ తెలిపారు.

వాదాలకుంటలో గ్యాస్ లీకై మంటలు

తల్లి, కుమారుడు, కుమార్తెలకు గాయాలు



గోపాలపురం, ఏప్రిల్ 18: ప్రమాదవశాత్తూ గ్యాస్ లీకై తల్లితో పాటు కుమారుడు, కుమార్తె మంటల్లో చిక్కుకుని గాయపడ్డారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. మండలంలోని వాదాలకుంట గ్రామంలో నామాల నిర్మల గురువారం ఉదయం వంట చేస్తుండగా గ్యాస్‌లీకై వంట గదిలో మంటలు వ్యాపించాయి. మంటల్లో చిక్కుకున్న తల్లిని కాపాడుకునే ప్రయత్నంలో కుమార్తె కల్యాణి, కుమారుడు కార్తీక్ కూడా చిక్కుకున్నారు. నానా తంటాలు పడి మంటల్లోంచి బయటపడ్డారు. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల సాయంతో మంటలను అదుపు చేసి క్షతగాత్రులను ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నిర్మలను మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

కొవ్వూరు, ఏప్రిల్ 18: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని కొవ్వూరు అగ్నిమాపక శాఖాధికారి ఏవీఎస్ఎన్ఎస్ వేణు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం కొవ్వూరు హోలీ ఏంజెల్స్ పాఠశాలలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్ లీకైనప్పుడు, అగ్ని ప్రమాదాలు, విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవలిసిన జాగ్రత్తలను వివరించారు. ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని రక్షించడం, ప్రథమ చికిత్స వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంటు వలియవీడు నెల్సన్ ఆంటోని, అగ్నిమాపక సిబ్బంది పి.అప్పారావు, సీహెచ్‌వీవీ గంగాధరరావు, ఎం.రవికుమార్, ఎన్.రామకృష్ణ, కె.ధనుంజయరావు, వై.రాంబాబు, ఎమ్.ప్రకాష్‌బాబు పాల్గొన్నారు.

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

నిడదవోలు, ఏప్రిల్ 18: నిడదవోలు నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ ఆర్‌వీ రమణనాయక్ అన్నారు. గురువారం నిడదవోలు పట్టణంలోని ఆర్.ఓ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని నామినేషన్ల ప్రక్రియ నామినేషన్ల స్వీకరణ మొత్తం వీడియో రికార్డింగ్ చేయడం జరుగుతుందని అన్నారు. నేటి నుండి ఎప్రిల్ 25 వరకు నామినేషన్ల స్వీకరణ, 26వ తేది పరిశీలన, 29వ తేది ఉపసంహరణ అనంతరం అదే రోజున అభ్యర్థుల తుది జాబితా ప్రకటించడం జరుగుతుందని తెలిపారు.

వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల నామినేషన్లు



నామినేషన్లు సమర్పిస్తున్న తలారి వెంకట్రావు, జీఎస్ నాయుడు

నిడదవోలు/కొవ్వూరు, ఏప్రిల్ 18: వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు గురువారం నామినేషన్లు దాఖలు చేశారు. నిడదవోలు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా జి.శ్రీనివాస్‌నాయుడు ఎన్నికల్ రిటర్నింగ్ అధికారి ఆర్‌వీ రమణనాయక్‌కు నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలతో పాదయాత్రగా వచ్చి నామినేషన్ అందజేశారు. దానిని ఆయన కుమారుడు వరుణ్‌సాయి ప్రతిపాదించాడు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తదితరులు పాల్గొన్నారు. అలాగే కొవ్వూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా తలారి వెంకట్రావు ఒక సెట్, వైసీపీ తరపున తలారి పరంజ్యోతి ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు.

వైసీపీ నామినేషన్లు.. ట్రాఫిక్ కష్టాలు



కొవ్వూరు-దొమ్మేరు రహదారిపై భారీగా నిలిచిన ట్రాఫిక్

కొవ్వూరు, ఏప్రిల్ 18: కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి నామినేషన్ ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. శుక్రవారం నామినేషన్ సందర్భంగా కొవ్వూరు మెరకవీధి వినాయకుని గుడి వద్ద క్యాంపు కార్యాలయం నుంచి ర్యాలీ చేపట్టారు. ఈ క్రమంలో కొవ్వూరు, దొమ్మేరు రహదారిలో ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు వైసీపీ కార్యకర్తలు, నాయకులు భారీగా మోహరించి సాధారణ ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించారు. దీంతో కొవ్వూరు-దొమ్మేరు రహదారిలో రాజమహేంద్రవరం వైపు, మరో వైపు దొమ్మేరు వైపు భారీగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో మధ్యాహ్నం 12గంటల వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. ఒక వైపు ఎండవేడిమి, మరోవైపు ఉక్కపోతతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. పోలీసులు గాని, ఎన్నికల స్క్వాడ్‌లు గాని పట్టించుకోకపోవడంతో ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిడదవోలులో మజ్జిగ చలివేంద్రం

నిడదవోలు, ఏప్రిల్ 18: నిడదవోలులోని రోటరీ సెంట్రల్ ఆధ్వర్యంలో గురువారం పటిక ఫ్యాక్టరీ సమీపంలో మజ్జిగ చలివేంద్రాన్ని రోటరీ సెంట్రల్ అధ్యక్షుడు బొల్లా శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో బూరుగుపల్లి సత్యనారాయణ, బీఎస్‌వీ ప్రసాద్, బండి గోపాలకృష్ణ, నీరుకొండ సుబ్రహ్మణ్యం, గంపా వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిడదవోలు, ఏప్రిల్ 18: నిడదవోలులో ఈ నెల 19న ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ బి.వీరభద్రరావు తెలిపారు. దీంతో గణేష్‌చౌక్, శాంతినగర్, బాహుజీనగర్, ఎస్టీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు.

తాళ్లపూడి: మండలం మలకపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ లైన్స్ మెయింటెనెన్స్ నిమిత్తం శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 12 గంటల వరకూ మలకపల్లి, రావూరుపాడు, ధర్మవరం, సావరం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ బి.వీరభద్రరావు తెలిపారు.

ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలి

ఉండ్రాజవరం, ఏప్రిల్ 18: వడగాల్పుల నుంచి రక్షణ పొందేందుకు ఓఆర్ఎస్ ద్రావణం తరచూ తీసుకోవాలని ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ ఆర్ఎస్ ప్రసాద్ తెలిపారు. గురువారం కె.సావరంలో వేసవిలో ఎండల నుంచి రక్షణ పొందే విధానంపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు గ్రామాల్లో సబ్‌సెంటర్లలో ఆశా కార్యకర్తల వద్ద అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.నాగ మణి, ఏఎస్ఎం రత్నకుమారి, ఎమ్ఎల్‌హెచ్‌పీ సంధ్య, హెల్త్ అసిస్టెంట్ అంబటి విజయకుమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1: లవ్‌గురు	
వై.స్క్రీన్2	: ఫ్యామిలీ స్టార్
దేవిశ్రీ(గాయత్రి)	: మంజుమ్మల్ బాయ్స్
అనన్య	: డీజే టిల్లు-2

నిడదవోలు

వీ మ్యాక్స్	: డీజే టిల్లు-2
రాధాకృష్ణ	: ఫ్యామిలీ స్టార్
శ్రీగణపతి	: మంజుమ్మల్ బాయ్స్

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	: ఫ్యామిలీ స్టార్
శ్రీరామ్ సినీ మ్యాక్స్	: ఫ్యామిలీ స్టార్

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	: భీమా
స్క్రీన్ 2	: ప్రేమలు
శ్రీనివాస	: గామి